# మిసిమి

మాస పత్రిక

ఫిబ్రవరి – 2000

వెల – రూ॥ 8/-



ఆంధ్రదేశంలో ప్రామాణిక కథా రచయితలలో ప్రథమశ్రేణికి చెందినవాడు హితశ్రీ - ఈయన అసలు పేరు మతుకుమల్లి వెంకటనరసింహ ప్రసాదరావు. ఆంధ్ర విశ్వకళాపరిషత్‌లో చదివింది వ్యాపార శాస్త్రమైనా, బోధించిందీ అదే అయినా, ప్రవృత్తిరీత్యా ఆయన సృజనశీలి. 1953లో న్యూయార్క్ - హెరాల్డ్ ట్రిబ్యూన్ నిర్వహించిన కథల పోటీకి ఆయన 'స్త్రీ' అనే కథ ఎన్నిక అయిందంటే, ఆయన సృజనశీలత ఏమిటో అర్థం అవుతుంది. 1949 నుంచి రాయడం మొదలైనా, తెలుగు స్వతంత్ర, భారతి, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి లాంటి పత్రికలలో ఆయన కథలు, నాటికలు, నాటకాలు ప్రచురితమైనా, రేడియోకు రాసినా ఆయన రచనల రాశికంటె వాసి గొప్పది.

ఆయన ఎప్పుడు 'దురదకథలు', 'రసకథలు', 'తాటాకు మంట కథలు', 'డప్పు కవిత్వం' రాయలేదు. ఆయన రచనలు గంభీరంగా ఉంటాయి. పైకి కనిపించే కథవేరు. దాని అంతర్వాహిని వేరు. ఆ అంతర్వాహినిని పట్టుకోలేకపోతే పాఠకుడు గజిబిజి అవుతాడు. ఆయన ఏ రచన తీసుకొన్నా అది పాఠకుని అంతరంగాన్ని, సున్నితమైన భావన, సంస్కార ఆర్ద్రతతో ప్లావితం చేస్తుంది. అనుభూతి ఆలోచనల సమ్మిశ్రణాలు ఆయన రచనలు. భావాభివ్యక్తిలో, రచనా శిల్పంలో, మనస్తత్వ చిత్రణంలో, తనదైన శైలిని రూపొందించుకొన్నారు. తెలుగు కథ మీద 'సంతకం' చేశారు.

ఆయనకు ఆంధ్రప్రభ 'కృష్ణవేణమ్మ తల్లడిల్లింది' కి ద్వితీయ బహుమతినిచ్చింది. తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు (1989), యువకళా వాహిని, హైదరాబాద్ గోపీచంద్ అవార్డు (1995), బొల్లిముంత అవార్డు (1997), చక్రపాణి - కొలసాని అవార్డు (1999) అందుకొన్నారు.

ఆయన రాసిన నాటికల్లో 'విముక్తుడు' ఆయనకు గొప్పపేరు తెచ్చిపెట్టింది. ఈ నాటికను, నాటక ప్రయోక్త ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రారు, కూర్మా వేణుగోపాల స్వామి, విశ్వవిద్యాలయంలో ఆడించారు. తెనాలి వి.యస్.ఆర్. కళాశాల నుంచి విద్యార్థుల్ని మీ సంపాదకులు (అప్పట్లో వి.యస్. ఆర్. కళాశాలలో పనిచేస్తున్నారు) విశ్వవిద్యాలయం రంగస్థలి మీద 'ఆడడానికి' వాల్తేరు తీసుకువెళ్ళారు.

విచిత్రజీవులు ఆయన నాటకమైతే, అంతర్వాహిని, సామాన్యుడి కామన ఆయన నవలలు. కథాసాగరం, హితశ్రీ కథలు, గులాబిపువ్వు - సిగరెట్టు, జరీఅంచు, హితశ్రీ కథా మంజూషిక పేర్లతో ఆయన కథాసంపుటాలు వెలువడ్డాయి. 'ముత్యాల పందిరి' పేరుతో ఆంధ్రజ్యోతిలో శీర్షికను నిర్వహించారు. ఇది హాస్య వ్యంగవల్లరి. కేరళ అకాడెమీ వారి విజ్ఞాన సర్వస్వానికి, 'తెలుగు కథా పరిణామం' మీద వ్యాసం వ్రాసి పంపారు. 1964-65లలో నూటపదహార్లు తెలుగు కథా సంకలనానికి (తాళ్ళూరి నాగేశ్వరరావుతో పాటు) సంపాదకత్వం వహించారు. దురదృష్టం అది వెలుగు చూడలేదు. అయితే విశాలాంధ్రవారు దానిలో సగాన్ని 58 కథలను (హితశ్రీ సంపాదకత్వం) ప్రచురించారు.

ఆయన ఏ రచన చేసినా మీ సంపాదకుణ్ణి 'దర్పణం' చేసుకొని ఆయన తన రచనా వైదుష్యాన్ని దర్శించేవారు.

కథలలో నాటికలలో వస్తుధ్వనిని, రసధ్వనిని పలికించిన ఆ 'కంఠం' 1999 డిసెంబరు 24వ తేదీ శుక్రవారం మూగవోయింది.

ఆయనకు మిసిమి నివాళులు.

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**

సంపుటి 12 ఫిబ్రవరి 2000 సంచిక 2

వ్యవస్థాపక సంపాదకుడు : డాక్టర్ **రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయసూచిక

కథ కంచికి.... - హితశ్రీ

ఉపశ్రేణి వాద అధ్యయనాలు - బి. తిరుపతిరావు

రాజకీయంగా ప్రధానమైన కోరిక లేమిటి? - డా. యు.ఎ. నరసింహమూర్తి

సంశయం - సత్యం - గూడ శ్రీరాములు

ఇస్మాయిల్ గారి రెండు పీఠికలకు కొన్ని సవరణలు - వివరణలు - గాలి నాసర రెడ్డి

ఆధునిక సమాజ సౌధ నిర్మాణ శిల్పి రామమోహన్‌రాయ్ - శివలింగం

విమర్శకుడు - శ్రీ శ్రీ - యం. మల్లారెడ్డి

విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **హితశ్రీ**

**Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Ltd.,**
**1-1-60/5, R.T.C. X Roads, Musheerabad, Hyd-20. Ph. 7645536**
**e-mail : misimi_m@hotmail.com**
**http : //www.misimi.com**

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# CAN'T INDIA FIGHT ITS OWN WARS

It is have reported the news that the Prime Minister, Mr AB Vajpayee, has openly accused Pakistan of having been behind the recent hijack of the Indian Airlines aircraft and said that the government would work systematically to ensure that the major nations of the world declare Pakistan a terrorist state. It was also reported that India expected the US to take the initiative in this direction.

The important question, however, is when is India going to "declare" Pakistan a terrorist state?

When the US declares a country a terrorist state it snaps diplomatic ties, trade relations and flight services. What is the definition of "terrorist state" for India. Does anyone know?

Why does the media always fail to ask the Prime Minister to define a terrorist state when he makes such a statement. This kind of failure is what allows politicians to make any statement and get away with it. The media has an important role to play in making politicians accountable for their statements.

The additional point is why does India and its Prime Minister expect the US and other major nations to fight India's battles. Does our beloved Prime Minister consider India a major nation or a minor nation? One in every six on the face of the earth is an Indian. Despite that don't we have enough resolve to fight our own battles? Shame on India. - Yours etc.,

Courtery : Statesman

# కథ కంచికి....

- హితశ్రీ

> ఒక రచయిత ఎందుకు రాస్తాడు? ఈ ప్రశ్న యుగయుగాలుగా ఉండనే ఉంది. దీనికి 'ఆత్మాభి వ్యక్తీకరణం' (self expression) అని సమాధానం చెబుతారు. మరి హితశ్రీ ఏమంటాడో ఆయన వాక్యాల్లోనే చదవండి. - సంపాదకులు

కథలు కల్పితాలే.

బీజప్రాయంగా వాస్తవం ఉండొచ్చు. మిగతాదంతా ఊహే,

ఊహ వాస్తవికంగా కనిపించొచ్చు.

కనిపిస్తే?

ఏముంటుందీ కథాసంవిధాన సౌధంలో?

ఏం విశిష్ట మవుతుంది కథలో?

ఏమిటీ కథల కథ?

ఎందుకీ కల్పిత కథలు?

ఏం చెప్పాలని?

ఏం సాధించాలని?

ఏం పొందాలని?

ఏదో రాయాలనే ఈ ప్రేరణ ఏమిటి?

ఎందుకివి చదవాలనే తహతహ?

అసలు కథలంటే?

ప్రేక్షకుల్ని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతూ ఐంద్రజాలికుడు టోపీలోంచి వరసగా తీసే కుందేళ్ళా?

తోటమాలి పూయించే రంగుల పువ్వులా?

ప్రవాహాన్ని ముందుకి దూకించే అలలా?

సమస్తాన్నీ ముంచెత్తుతూ పొంగిపొర్లే ఏటి వరదలా?

కలలా?

మెరుపులా?

చైతన్యం స్మరించే సౌహృదాలా?

నాదస్వరాలా? సమ్మెటలా?

వెన్నెల జల్లులా? చంద్ర నిప్పులా?

కొత్తగాలులా?

చీకట్లని చీల్చే తెల్లటి సూర్య కిరణాలా?

ఇవన్నీనా? ఏవీ కావా?

ఎవరు ఎలా స్మరిస్తే కథ అలాగే దర్శనమిస్తుందా?

కథకి కాళ్ళులేవు, ముంతకి చెవులు లేవు అంటారు కదా! అంటే?

కథ కంచికి పోవటం అంటే? అదేమైనా సంకేతమా?

ఇలా ఎన్నో ప్రశ్నలు.

''ఏమో!'' అనే నేననగలిగే మాట.

మరి స్పష్టంగా ఏం తేల్చుకోకుండా ఎందుకు రాస్తున్నట్లు? ఏమిటి రాస్తున్నట్లు? నిజమే, కాని -

ఏవేవో అనుభవాలూ, అనుభూతులూ, ఆలోచనలూ అందరికీ ఉంటూంటాయి.

ఏ అనుభవ మేఘమో పలకరిస్తే -

ఏ అనుభూతి తరంగమో ముంచెత్తితే -

ఏ ఆలోచనా మారుతమో ఊపివేస్తే -

ఏదో నిజం - నిజమని అనిపించేది ఏదో - తళుక్కుమంటుంది.

అలా ఎన్నెన్నో నిజాలు, వాటిని గురించి రాసేదాకా ఊపిరి సలపని నిజాలు. ఎన్నో నిజాలుంటాయా?

నిజమనేది ఒకటే కాదా? ఒకటి నిజమైతే రెండోది ఎలా నిజమవుతుంది? ఒకటే నిజం.

కేవల నిజం.

అయితే అది వివిధ రంగాల్లో వివిధ రకాలుగా బహుళంగా భాసిస్తుంది - అభివ్యక్తమవుతుంది.

శాస్త్రీయ సత్యాలుగా, వాస్తవికాలుగా, మనోవైజ్ఞానిక సత్యాలుగా, సామాజిక సత్యాలుగా, జీవిత సత్యాలుగా ..... ఇలా.

ఇవి ఎవరికీ తెలియనివా?

అందరికీ తెలిసినవే.

తెలిసినవి రాయటమెందుకు?

నిజాలు కథల్లో నిజాలుగా ఉండవు.

విలువలుగా మారిపోతాయి.

విలువలంటే జీవిత విధానంలో మనం సమ్మానించే భావనలు.

ఆచరణీయాలుగా మనం ఆమోదించేవి.

కథలో అంతర్గతంగా ఉండే నిజం విలువ అనుభూతికి అందిన క్షణాన తటిల్లని మెరుస్తుంది.

సమాజం ఓ నిజం.

సమాజం తన ప్రజల్ని చుట్టివేసి తనలో ఇముడ్చుకోటం నిజం.

సమాజం మారిపోతూ ఉండటం నిజం. ముందుకి పోటం నిజం.

అందరూ సమానమనేది నిజం. మనిషి సమాజజీవి అనేది నిజం.

సమాజంలోని ఓ వ్యక్తి తోటివానితో ఏదో పంచుకోటం ఓ విలువ.

తనలో సమాజ సుందరేశ్వరుణ్ణి గుర్తించటం ఓ విలువ.

అందరిలో తనని చూడటం ఓ విలువ.

ధర్మం కోసం రుద్రుడై పోవటం ఓ విలువ.

దారిద్ర్యాన్ని తొలగించటానికి నడుం కట్టటం ఓ విలువ.

సమాజాన్ని శక్తి మేరకి క్షాళనం చెయ్యటం ఓ విలువ.

ప్రజాస్వామ్యాన్ని కలుషితం చేసేవాళ్ళని బయట పెట్టటం ఓ విలువ.

కర్తవ్య నిర్వహణలో తొణకకపోటం ఓ విలువ.

సమాజంకోసం త్యాగం చెయ్యటం ఓ విలువ.

సమాజం నిజమైనట్టే వ్యక్తి నిజం.

వ్యక్తిలో ఇడ్, ఇగో, సూపర్ ఇగోల సంఘర్షణ నిజం.

సహజాతాలు, కాంప్లెక్సులు నిజం.

ఆవశ్యకతలు నిజం, కలలు నిజం.

లిబిడో నిజం.

బతుకు నిజం, మూర్తిమత్వ నిరూపణ నిజం.

సంఘర్షణని జయించి ఆదర్శపు జెండా ఎగరెయ్యటం ఓ విలువ.

ప్రేమించటం ఓ విలువ.

ప్రేమసామ్రాజ్యాన్ని అన్ని దిక్కులకీ విస్తరింపచెయ్యటం ఓ విలువ.

ఆ సామ్రాజ్యంలో శుక పిక శారికా గీతికా సంగీతానికి స్పందించటం ఓ విలువ.

ఉదాత్తత ఓ విలువ.

ధర్మం తప్పక పోవటం ఓ విలువ.

ఆర్ద్రత ఓ విలువ.

స్వేచ్ఛ ఓ విలువ.

తెలియంది చాలా ఉందనేది నిజం.

నదులన్నీ సాగరంలో కలిసి పోతాయనేది నిజం.

అజ్ఞాత శక్తికి నివాళి నివ్వటం ఓ విలువ.

క్షణక్షణ చైతన్యం అద్వయానుభవంలో కరిగిపోవటం ఓ విలువ.

నిజాలు తెలిసినట్టే, విలువలూ అందరికీ తెలిసినవే. మరింతగా తెలిసినవే.

అవి జీవితంలో అనుక్షణం ఎదురయేవే.

మరి, వాటిని గురించి రాయటమెందుకు?

అనుభవాల్లో అంతర్లీనంగా ఉన్న

చైతన్యం వెల్లివిరియటం కోసం.

మంచులాంటి జడం కరిగి స్రవంతి అయితే, మిట్టపల్లాలు ఏకం చేస్తూ, చిందులు తొక్కుతూ ప్రవాహం ఉధృతమైతే, చైతన్యం ఉత్తుంగ తరంగాలతో సమ్మోహనకరంగా లాస్యం చేస్తుంది. నాదీ, అందరిదీ.

ఆ చైతన్యం -

ఆ చైతన్య లాస్యమే -

మానవతా వికాసం,

మానవతా సర్వస్వం,

మానవతా సారంగా నాకు అభివ్యక్త మవుతుంది. శుద్ధసత్వంగా గోచరిస్తుంది. కుందేందు తుషారహార ధావళ్య మేదో కళ్ళని మిరుమిట్లు గొల్పుతుంది. భారతి వీణ వాయిస్తున్నట్లుగా ఉంటుంది.

ఆ వైభవమే రాయమని పురికొల్పేది.

అయితే, అనుభవం ఏదో మెదిలి, ఓ విలువ స్ఫురించి, ఏదో నిజం గోచరించినంత మాత్రాన కథ కదిలి రాదు. అదో రూపం సంతరించుకోవాలి.

తెలిసీ తెలియనిదీ, అందీ అందనిదీ ఏదో రూపం మదిలో మెదులుతుంది.

వినిపించనిదేదో వినిపిస్తుంది.

అదో వేదన, అదో మధుర భావన.

అదో తపస్సు.

ఉన్నట్టుండి కళ్ళముందేదో కదలినట్టవుతుంది - సుతారంగా, సవిలాసంగా, మనోజ్ఞంగా, సరికొత్తగా, నవనవోన్మేషంగా.

ఏదో సౌందర్యం.

తటిల్లతలా,

అరవిరిసే పద్మంలా,

జారిపడే జలపాతంలా,

విరిగిపడే కెరటంలా,

కదిలే శారద నీరదంలా,

మెరిసి మురిసి పలకరించి నట్టవుతుంది.

అదే కథా సాక్షాత్కారం.

మనసు పరవశిస్తుంది. హృదయం ప్రఫుల్ల మవుతుంది. నాలోని సారం అంతా

ఆ సౌందర్యంలో కలిసి పోతోందా?

ఏదో అనిర్వచనీయ స్థితి, అన్నీ లయమై పోయిన అనుభూతి.

నిర్గుణ నిశ్చల స్థితి - క్షణికమే కావచ్చు.

మానవుడి సహజ స్థితి.

మానసిక సమతౌల్యమేనేమో - మన భాషలో ఆనందం.

ఏమిటీ అనుభూతి? భావావేశం పరాకాష్ఠ చెందినప్పటి నిశ్చలస్థితేనా?

ఎలా కలుగుతోంది ఇది?

అందాన్ని గుర్తించటంలోనా?

ఎక్కడిదీ అందం?

కథలోని అర్థవంతమై ఆకర్షణీయమైన కొత్తదనంలో

విలసిల్లుతుందా అందం? ఐక్యతలోనా? సంపూర్ణతలోనా?

అందం ఆనంద మెందుకివ్వాలి?

అసలు అందం ఆనందం వేరా?

రూపగతమైన ఆనందమా అందం అంటే?

అన్నీ కలిసి పోయిన స్థితిలో అందం ఆనందం ఒకటే కదా!

అది - అదే మానవుడి సహజ స్థితి. అది సంతోషం కాదు.

ఓ దివ్యానుభవం.

బాధలతో, భయాలతో, ద్వేషాలతో మానవుడు ఆ సహజ స్థితినించి

దూరదూరంగా తొలగిపోతున్నాడు.

ఒక్క క్షణం ఆ సహజ స్థితి లభింపచేసేదే -

ఒక్క క్షణం నిజాన్ని తళుక్కునిపించేదే -

కథా సౌందర్యమా?

అయితే ఈ సౌందర్యానికి రూపు కట్టటం ఎలా?

భావాలు అందీ అందవు.

పదాలు సరిపోవు. వెంట వెంటనే రావు.

ఊహని కదిలించే పదచిత్రాలు తట్టవు.

అనుభవాన్ని, అనుభూతిని ఎలా మాటల్లో కుదించటం?

ఎంతచెప్పినా ఇంకా చెప్పాలిసింది చాలా ఉందనిపిస్తుంది.

అక్షరాల్లో ఎలా ఆ రూపాన్ని ఆవిష్కరించటం?

ఎంత తపస్సు చేస్తే యేం?

అది నాకు సాధ్యమా!

ఏదో రాయటమే అవుతుంది.

ఏదో వెలితిగానే ఉంటుంది.

ఎప్పుడో అరుదుగా -

ఎక్కడో దూరంగా, అస్పష్టంగా

ఏ మూలో మెరిసినట్టుగా

రాయంచ రెక్కలు విప్పినట్టుగా

శుభ్రవస్త్రం రెపరెపలాడినట్టుగా

చిరునవ్వు విరిసినట్టుగా

క్రమంగా అంతా తెలుపై పోతున్నట్టుగా

వీణ మోగినట్టుగా

ఓ క్షణం భ్రమ - అంతే!

# ఉపశ్రేణి వాద అధ్యయనాలు (Subaltern Studies)

- బి. తిరుపతిరావు

'ఉపశ్రేణి' (Subaltern) అనే పదాన్ని ఇటాలియన్ మార్క్సిస్టు తాత్వికుడు అంటోనియో గ్రాంసీ 1930లలో జైలు రచనలో ఉపయోగించారు. ఐక్యతలేని, ఏ నిర్మాణ రూపాలులేని, నిరంతరం అమలులో వున్న అధికారం చేత అణిచి వేయబడుతూ వున్న సామాజిక బృందాల్ని సూచించటానికి గ్రాంసీ ఈ పదాన్ని వాడటం జరిగింది. ఆధిపత్య బృందాలు అమలు చేసే అధికారానికి, అణిచివేతకు గురవటమే తప్ప అధికారాన్ని ప్రయోగించే స్థితిలో సమాజంలోని ఉపశ్రేణి బృందాలు వుండవు. ఆ అవకాశం ఈ బృందాలకు వుండదు.

చరిత్ర అంటే రాజ్య చరిత్రగా, పాలకవర్గాల చరిత్రగా, ఆధిపత్య బృందాల చరిత్రగా కొనసాగుతూ, బావింపబడుతూ వస్తున్న సంధర్భాన్ని గుర్తించిన గ్రాంసీ ఉపశ్రేణి బృందాల లేక వర్గాల చరిత్ర రచనా (historiography) గురించి ఆలోచించాడు. ఈ క్రమంలో ఉపశ్రేణి బృందాల చరిత్రకూడా సంక్లిష్టమైనదేనని ప్రకటించాడు. ఇది ఒక రకంగా ఆధిపత్య లేక 'ఉన్నతశేణి' బృందాల వర్గాల చరిత్రనే 'అధికార ' చరిత్రగా ప్రకటించే ఆలోచనకి గ్రాంసీ ఆలోచన ఆలోచన ఒకరకమైన చెంపపెట్టు. ఉన్నతశ్రేణి బృందాల చరిత్రను కీర్తిస్తూ మిగతా సామాజిక బృందాలకి చరిత్ర లేదన్నట్టు ప్రకటించే చరిత్ర కారులకి ఇదొక సవాలు.

ఉపశ్రేణి బృందాల చరిత్ర శకలాలుగా, విడివిడి సంఘటనలుగా వుంటుంది. కారణం ఈ బృందాలు ఎప్పుడూ ఆధిపత్య బృందాల చేత నిర్దేసించబడుతూ, నియంత్రించబడుతూ వుంటాయి. తమ ప్రాదాన్యతల్ని, ప్రాముఖ్యతల్ని చాటుకోవటానికి, నిర్దేసించుకోవటానికి అవసరమైన సాదనాల్ని పొందే అవకాశం ఉపశ్రేణి బృందాలకి వుండదు. అలాగే సామాజిక, సాంస్కృతిక సంస్థలు వీళ్ళకి అందుబాటులో వుండవు. అందువల్ల ఈ బృందాలకి సంబంధించిన చరిత్ర మరుగుపర్చబడి గుర్తింపు లేకుండా పోతుంది. విస్మృతలోకి పోయిన, అణిచివేయబడిన, మరుగు పర్చబడిన ఈ చరిత్రని వెలికి తీసేపని ఇవ్వాళ ఉపశ్రేణి వాద అధ్యయనకారులు చేస్తున్నారు. దక్షిణాసియా దేశాల్లో ఈ కృషి చాలా తీవ్రంగానే జరుగుతోంది. నిజానికి దక్షిణాసియా దేశాల్లో చరిత్ర రచనా శాస్త్ర దృష్టింతా ఉపశ్రేణి బృందాల పరిశీలనలోనే నడుస్తుంది.

భారత దేశంలో ఉపశ్రేణి బృందాల చరిత్రని, సంస్కృతిని వెలికితీసేపని రంజిత్ గుహ, సహిద్ అమిక్, డేవిడ్ ఆర్నాల్డ్, పార్థచటర్జీ జ్ఞాన్‌పాండేలతో పాటు ఇంకా అనేక మంది ఈ కృషి చేస్తున్నారు. దక్షిణాసియా దేశాల్లో వర్గం, కులం, జండర్ తెగ మొదలైనవి అణిచివేతకి ఎలా కారణాలుగా వుంటూ వచ్చాయో, పరాధీనతని ఎలా సాధికారీకరించాయో ఈ ఉపశ్రేణివాద అధ్యయన బృందం అనేక సంపుటాలు ప్రచురించింది. ఈ సంపుటాల్లో ఉపశ్రేణీయతకు (subalterneity) సంబంధించిన చరిత్ర, రాజకీయాలు, ఆర్థిక శాస్త్రం, సామాజిక శాస్త్రంల గురించిన వ్యాసాల్ని ప్రచురించటం జరిగింది. అలాగే ఈ ఉపశ్రేణీయతకు సంబంధించిన జీవనశైలుల్ని, భావజాలాల్ని, విశ్వాసాల చట్రాల్ని, క్లుప్తంగా చెపితే ఉపశ్రేణి బృందాల సాంస్కృతిక సాంస్కృతిక సమాచారాన్ని అందించే ప్రయత్నం ఈ అధ్యయనాలలో జరుగుతోంది.

ఉపశ్రేణి వాద అధ్యయనాల నిర్దిష్ట లక్ష్యం చరిత్ర రచనాశాస్త్రాన్ని ఉన్నతశ్రేణి కేంద్రక దృష్టినుంచి బయటపడవేసి వాస్తవాన్ని వెలికి తీయటం. దక్షిణాసియా చరిత్రలో ఇది ప్రధానంగా జరుగుతోంది. ఉన్నత శ్రేణి బృందాల్ని కేంద్రం చేసుకుని చరిత్రని వ్యాఖ్యానించే పద్ధతుల్ని, అధ్యయనాల్ని తిరస్కరించి వస్తుగతాత్మక దృష్టితో చరిత్రని అర్థం చేసుకోవటానికి విశ్లేషించటానికి ఈ అధ్యయనాలు ప్రయత్నిస్తున్నాయి.

భారతదేశ చరిత్రకు సంబంధించి ఉపశ్రేణిమీద అధ్యయన కారులు రెండు ప్రధాన స్రవంతుల్ని గుర్తించారు; ఒకటి బ్రిటిష్ వలివాస దృష్టితో నడిచే స్రవంతి, రెండు జాతీయవాద ప్రేరకంగా నడిచే స్రవంతి. జాతీయవాద దృష్టితో నడిచే స్రవంతి బ్రిటిష్ వలసవాద స్రవంతిని లేక దృష్టిని ఖండించినప్పటికీ జాతీయవాద దృష్టిని కూడా ఒకానొక ఉన్నతశ్రేణి దృక్పథం వెన్నంటి వస్తూనే వుంది. సారాంశంలో బ్రిటిష్ వలసవాదుల చరిత్ర రచనా శాస్త్రం, భారత జాతీయవాదుల చరిత్ర రచనా శాస్త్రం, రెండూ కూడా ఉన్నత శ్రేణి బృందాల్ని కేంద్రం చేసుకునే చరిత్రని వ్యాఖ్యానించాయి. ఫలితంగా ఈ రెండు స్రవంతులు లేక దోరణులు భారతదేశంలో రూపుదిద్దుకున్న జాతీయోద్యమ చైతన్యాన్ని వలసవాదుల పాలసీల సాధనగా చుశాయి. వలస సంస్కృతీ సంపర్క ఫలితంగా గుర్తించాయి. లేకపోతే కొంతమంది ప్రముఖులు, శిష్టులి లేక కొన్ని సంస్థల సాధనగా నిర్ధారించాయి. ఈ కారణంగా ఈ రెండు దోరణులచరిత్ర రచనా శాస్త్రాలు జాతీయోద్యమ చరిత్రలో ప్రజలు అక్కడక్కడా తమ సొంత చైతన్యాన్ని ప్రదర్శించిన సంఘటనల్ని, సందర్భాల్ని విస్మరించాయి. ఈ దోరణులు విస్మరించింది నిజమైన అర్థంలో ప్రజల రాజకీయాల్ని ఉన్నతశ్రేణి రాజకీయ బృందాలు ముందుకు తెచ్చిన రాజకీయాలు, వ్యూహాలు పనికి రాకుండా పోయినప్పుడు కూడా స్వయం ప్రతిపత్తితో నడచిన రాజకీయాల్నే ఉన్నతశ్రేణి వాద చరిత్ర విస్మరించింది.

ఉన్నతశ్రేణి వాద, ఉపశ్రేణివాద చరిత్ర రచనా శాస్త్రాల మధ్య తేడాని గమనించాలంటే రాజకీయ సమీకరణాల్లో వివిధ సామాజక బృందాలు నిర్వర్తించిన రాజకీయ ఉద్యమాల పట్ల అవి ఏ వైఖరి తీసుకున్నాయో చూస్తే తెలుస్తుంది. ఉన్నత శ్రేణి వాద చరిత్ర కొంతమంది ప్రముఖ నాయకులు బ్రిటీష్ పార్లమెంటరీ తరహా నిర్మితమయిన సంఘాల ద్వారా సంఘటిత పర్చబడిన పోరాటాల్ని మాత్రమే గుర్తిస్తే, ఉపశ్రేణివాద చరిత్ర రచన ఇందుకు భిన్నంగా సాంప్రదాయకంగా వస్తున్న సంఘాల ద్వారా, ప్రాంతీయ బృందాల ద్వారా ముందుకు వచ్చిన రాజకీయ ఉద్యమాల ప్రాధాన్యతని గుర్తిస్తుంది. దీన్ని మన నిర్దిష్ట చరిత్రకి అనువర్తించి చూస్తే భారత స్వాతంత్ర్య పోరాటంలో నిజమైన ప్రజాసమీకరణ రైతు తిరుగుబాట్ల, పోరాటాలలో వ్యక్తమయినట్లు తెలుస్తుంది. (రాజకీయ చట్టాలు మారినప్పటికీ రాజకీయ కార్యాచరణకి ఈ పద్ధతులు ఇవ్వాళ్టికీ సరైనవిగా ఉపశ్రేణివాద చరిత్ర రచనా శాస్త్రం నమ్ముతుంది.) భారత జాతీయవాదం కొంతమంది శిష్టులు, దేశీయ నాయకులు, నాయకత్వ ప్రతిభ కారణంగా ప్రజల్ని స్వాతంత్ర్యోద్యమం వైపు నడిపించారని నమ్ముతుంది. ఉపశ్రేణివాదానికి ఈ అభిప్రాయం పూర్తి విరుద్ధం.

ఉపశ్రేణివాద చరిత్ర రచనా శాస్త్రకారుల మధ్య కొన్ని తేడాలు వున్నప్పటికీ ఉన్నతశ్రేణి ఆధిపత్యవాద దృష్టిని అందరూ నిరాకరిస్తారు. ఉపశ్రేణివాద చరిత్ర రచన వలస వాదంగ జాతీయవాదం,

సామ్రాజ్యవాదంగ ప్రాంతీయ సాంస్కృతిక వ్యక్తీకరణ లాంటి అనేక రాజకీయ, సాంస్కృతిక ద్వంద్వాల్ని నిర్దిష్టంగా గుర్తిస్తుంది. వలస వాద చరిత్ర రచన, జాతీయ వాద చరిత్ర రచన రెండూ ఒకటి కాకపోయినప్పటికీ రెండు ధోరణులు మధ్య తరగతి వర్గాన్ని కేంద్రం చేసుకుని చరిత్రని పరిశీలించాయి, వ్యాఖ్యానించాయి. చరిత్రలో ఉపశ్రేణి బృందాల పాత్రని ఉపేక్షించాయి, ద్వితీయ స్థానంలోకి నెట్టివేశాయి. ఉదాసీనస్థితిలో, అజ్ఞానంలో వున్న ఉపశ్రేణుల్ని ఆ బృందాలకి వెలుపల వున్న కొంతమంది చైతన్యవంతమైన వ్యక్తులు నాయకత్వం వహించి ముందుకు నడపబడాల్సినవి చూశాయి పై రెండు చరిత్ర రచనా ధోరణులు.

అధికార చరిత్ర రచనా శాస్త్రానికి ప్రతిప్రవచనంగా వచ్చిన ఉపశ్రేణివాద చరిత్ర రచన తనముందు రెండు లక్ష్యాల్ని పెట్టుకుంది; ఒకటి అధికారచరిత్ర వదిలి వేసిన, విస్మరించిన ఖాళీలను, ముగింపులను తిరిగి పరిశీలించటం ద్వారా జాతీయవాదం ఉపశ్రేణీయతని ఎందుకు కదిలించలేకపోయిందో, పట్టించుకోలేకపోయిందో వెలికితీయటం రెండు ప్రచురణ పొందని, మరునపడిన సంఘటనల్ని, సాంస్కృతిక వ్యక్తీకరణల్ని, రూపాల్ని గురించిన పురావస్తు సమాచారాన్ని ప్రోదిచేయటం. అలా చేయటం ద్వారా నిర్దిష్టమైన చరిత్ర రచనకి ఉపక్రమించటం.

గాయత్రి చక్రవర్తి స్పివాక్ లాంటి వలసానంతరవాద తాత్వికులు ఉపశ్రేణి చరిత్ర రచనా పద్ధతిని గౌరవిస్తూనే ఉపశ్రేణి బృందాల్లో కూడా అమలవుతూవున్న పితృస్వామిక, లైంగిక, వలసవాద, వర్గకేంద్రక అణిచివేతల్ని కూడా పట్టించుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నారు.

## DO I KNOW

Where It Hurts?

Reporting in the journal Psychosomatics, two doctors say that Prism is a novel and simple instrument that allows patients to express their feelings about their own suffering

Prism stands for 'Pictorial Representation of Illness and Self Measure'. It is graphical interface in which patients are asked to express their perception of suffering in terms of its perceived 'distance' from the self. The test is pictorial and therefore much quicker, relying only minimally on language, and requires no batteries.

The doctors – Stefan Buchi of the University of Zurich, Switzerland, and Tom Sansky of Imperial College School of Medicine, London, UK – describe how Prism works. The patient is shown a white metal board the size of a standard (A4) piece of paper. Fixed in the bottom right-had corner is a yellow circle, seven centimeters across. The patient is asked to imagine that the white board represents his or her life, and that the yellow circle is his or her 'self.

The patient is then handed a five-centimeter-diameter red disk, representing the illness, and is asked, "Where would you put the illness disk in your life at the moment?" Patients overwhelmed by pain and distress place the red disk on top of the yellow one, whereas patients who feel more in control of their pain place the disks some distance apart. They claim the measure is quantitative.

In a pilot study on patients with rheumatoid arthritis, it was found that the separation between the disks is a consistent measure of perceived pain and the misery associated with it. PRISM could turn out to be a useful research tool as well as a handy aid for the clinic.

# రాజకీయంగా ప్రధానమైన కోరిక లేమిటి?

## (1950 నోబెల్ సాహిత్య బహుమతి పురస్కారోపన్యాసము)

మూలం : **బెర్ట్రాండ్ రస్సెల్** అనువాదము : **డా. యు.ఎ. నరసింహమూర్తి**

సమకాలీన రాజకీయ చర్చలు, రాజకీయ సిద్ధాంతం మనోవిజ్ఞానాన్ని తగినంతగా గణింపని కారణంగా ఈనాడు ఈ విషయాన్ని నా ఉపన్యాసానికి లక్ష్యంగా ఎంచుకున్నాను. ఆర్థికపరమైన వాస్తవాలు, జనాభా గణాంక వివరాలు, రాజ్యాంగ వ్యవస్థ మొదలైనవి సూక్ష్మేక్షికతో మనముందు వివరంగా ఉంటాయి. కొరియా యుద్ధం ప్రారంభమయ్యే టప్పటికి దక్షిణ కొరియాలో ఎందరున్నారు. ఉత్తర కొరియాలో ఎందరున్నారు; వారి సగటు ఆదాయమెంత? వారి సైన్య శక్తి ఎంత? మొదలైన వివరాలన్నీ మనకు తెలుస్తాయి. కాని కొరియన్ ఎలాంటివాడు; ఉత్తర కొరియావానికి దక్షిణ కొరియావానికి గణింపదగిన భేదమేమిటి? వారి జీవన లక్ష్యాలేమిటి? వారి అసంతృప్తులేమిటి? వారి ఆశలేమిటి? వారి భయాయలేమిటి? అన్న ప్రశ్నలకు ఎక్కడా సమాధానం కనబడదు. అందుచేత దక్షిణకొరియా వాసులు ఐక్యరాజ్య సమితిమీద ఆసక్తికలిగి ఉన్నారా? ఉత్తరకొరియా సోదరులతో కలిసి జీవించాలనుకుంటున్నారా అన్న సంగతి మీద చెప్పలేము. ఎన్నడూ కనీవినీ ఎరుగని ఒక రాజకీయవాదికి ఓటు వేసే హక్కు పొందడం కోసం వారు భూ సంస్కరణలను పణంగా పెట్టడానికి సంసిద్ధులుగా ఉన్నారా! లేదా? అనే అంశాన్ని కూడా మీరు ఊహించలేరు. దంతహర్మ్యాలలో నివసించే మేధావులు ఇలాంటి ప్రశ్నలను విస్మరించడం తరచుగా అసంతృప్తిని కలిగిస్తుంది. రాజకీయం శాస్త్రీయంగా ఉండాలంటే, అది నిరంతరం విస్మయం కలిగించే స్థితిని అధిగమించాలంటే రాజకీయ చింతన ప్రజల మానసిక వ్యాపారాల్లోకి చొచ్చుకుని పోవాలి. నినాదాల మీద ఆకలి ప్రభావమెంత? మీ ఆహారం లోని కేలరీల సంఖ్యతో ముడిపడి ఆ నినాదాల తీవ్రత ఏవిధంగా మారుతూ ఉంటుంది? ఒకడు ప్రజాస్వామ్యాన్ని ఇంకొకడు బస్తా ధాన్యాన్ని ఇవ్వజూపినపుడు ఆకలికి సంబంధించిన ఏదశలో ఓటుకు బదులుగా మీరు ధాన్యం బస్తాని ఆశిస్తారు? ఇలాంటి ప్రశ్నలనింతవరకు పట్టించుకోలేదు. ఏమైతేనేమీ - కొరియన్ల సంగతి అలా వదలి మానవ జాతిని గూర్చి మన ఆలోచనను మళ్లిద్దాం.

మనుష్య వ్యాపారాలన్నింటినీ కోరికలు ప్రేరేపిస్తాయి. కఠోరవిధి విధానాలతో, నీతినియమాలతో కోరికను మళ్లించుకోవచ్చునన్న నీతివాదుల తప్పుడు ఆలోచన ఒకటుంది. అది కేవలం తప్పుడు ఆలోచన. విధికి బద్ధుడనై ఉండాలనే కోరికలేని ఏ మనిషినీ విధి బంధించి ఉంచలేదు. మనుష్య లేం చేస్తారు అన్న విషయం తెలుసుకోవాలంటే వాళ్ళ భౌతిక పరిస్థితులను మాత్రమేకాదు, వాళ్ల శక్తికి సాపేక్షంగా ఉండే వారి వాంఛాచక్రాన్ని కూడా ఆకళించుకోవాలి.

రాజకీయ ప్రాధాన్యాన్ని అంతగా సంతరించుకోని కోరికలు కొన్ని ఉంటాయి. ఒక వయసు వచ్చేటప్పటికి పెళ్ళి చేసుకోవాలనే కోరిక చాలామందికి కలుగుతుంది. రాజకీయంతో సంబంధం లేకుండా ఆకోరిక తీర్చుకోవచ్చును. సబైన్ స్త్రీల మానభంగ వృత్తాంతం ఇందుకొక అపవాదం కావచ్చు. ఉత్తర ఆస్ట్రేలియాలో స్త్రీల సంఖ్య పరిమితంగా ఉండడం వల్ల యౌవనోద్రేకంలో పడ్డ పురుషుల చర్య అది. కాని అలాంటి ఎప్పుడో, ఎక్కడో ఉంటుంది. స్త్రీ పురుషుల పరస్పరాసక్తికి సంబంధించిన ఈ చర్య - రాజకీయం మీద అంతగా ప్రభావాన్ని చూపదు.

రాజకీయ ప్రాధాన్యంగల కోరికలను రెండు వర్గాలుగా విభజింపవచ్చును. మొదటి వర్గంలో తిండి, బట్ట, వసతి అనే జీవితావసరాలుంటాయి. ఇవి కరువైతే మనుష్యులు వీటికోసం ప్రాణాలొడ్డి పోరాటం చేస్తారు. ఎంతకాలమైనా చేస్తారు. ఎంతకైనా తెగిస్తారు. కరువు కారణంగా అరేబియన్లు పరిసర ప్రాంతాల్లోకి విరుచుకుపడడం వల్ల రాజకీయంగా, సాంస్కృతికంగా, మతపరంగా ఎన్నో మార్పులు కలగడం నాలుగు వేరు వేరు సందర్భాలలో ఎలా జరిగిందో ప్రాచీన చరిత్రను అధ్యయనం చేసిన విద్యార్థులందరికీ తెలుసు. ఈ నాలుగు సందర్భాలలో చివరిది ఇస్లామ్ ఆవిర్భావం. జర్మను తెగలు దక్షిణ రష్యాలోకి, అక్కడ నుండి ఇంగ్లాండుకు, అక్కడినుండి శాన్ ఫ్రాన్సిస్కోకు క్రమంగా విస్తరించడం కూడా ఇలాంటిదే. ఆహారాన్వేషణ ప్రబలమైన రాజకీయ సంఘటనలకు కారణమని నిస్సందేహంగా చెప్పవచ్చును. ఇది సార్వకాలిక సత్యం.

కోరికలకు అంతులేకపోవడ మనేది మనిషిని ఇతర జంతువుల కంటె వేరు చేయగల ముఖ్యలక్షణం. మనిసికి 'ఆశాపాశము తాకడున్నిడుపు' స్వర్గాన్ని అరచేతిలో పెట్టినా ఆశగల మనిషి తృప్తిపొందడు. ఒక్కొక్క మనిషి అన్నం తిని పడుకుంటే తిరిగి ఆకలి వేసే దాకా లేవడు. కాని మనుష్యులందరూ ఇలాంటి వాళ్లుకారు. అనామకులుగా ఉండే అరబ్బులు తూర్పు రోమను సామ్రాజ్యపు సంపదలను కొల్లగొట్టి సుందర హర్మ్యాలలో నివసించి, అనూహ్య వైభవాన్ని అనుభవించేరు. కాని అంతటితో తృప్తిపడి ఊరుకోలేదు. ఆకలి ఒక్కటేకాదు. ఆక్రమణ, శత్రుత్వం, ఆడంబరం, అధికారలాలస అనే నాలుగు ముఖ్యమైన కోరికలు వాళ్లను కదిలించేయి.

వీలైనంత వస్తు సముదాయాన్ని సంపాదించడం లేదా వాటి మీద స్వామ్యాన్ని కలిగి ఉండడం సంచయేచ్ఛకు కారణం. భయం, దైనందిన అవసరాల మీది కోరిక కలిసి సంచయేచ్ఛను కలిగిస్తాయి. ఎస్టోనియాలో కరవు బారినపడి చావును తప్పించుకున్న ఇద్దరు బాలికలతో నేనొకప్పుడు స్నేహం చేసేను. మా ఇంట్లో వాళ్లు తినడానికి అవసరానికి మించి కూడా ఉండేది. అయినా వాళ్లు తీరిక వేళల్లో సమీపంలో ఉండే పొలాల్లో పడి బంగాళాదుంపలు దొంగిలించి దాచుకునేవారు. బాల్యంలో దుర్భరదారిద్ర్యాన్ని అనుభవించిన రాక్‌ఫెల్లర్ ఈ పద్ధతిలోనే తన పరిణత జీవితాన్ని గడపేడు. అలాగే అరబ్బీ నాయకులు కూడా బైజాన్టైన్ సిల్కు దివానుల మీద కూర్చున్నా ఎడారిని మరువలేకపోయారు. అందుకే అవసరానికి మించిన సంపదల్ని రాసులు పోసుకున్నారు. అతి సంచయేచ్ఛ వెనుకనున్న మనస్తత్వం ఏదైనా కానీండి శక్తికలవారికున్న లక్ష్యాలతో అది ప్రధానమైనది. సంపాదిస్తూన్న కొద్దీ సంపాదన మీద కోరిక పెరుగుతుంది. తృప్తి అనే కల ఎప్పుడూ నీకు చిక్కకుండా తప్పించుకుంటూ ఉంటుంది.

సంచయేచ్ఛ ధనస్వామ్య వ్యవస్థకు మూలకారణమైనా, ఆకలిని జయించే అనేక మార్గాలలో అది అత్యంత శక్తివంతమైనది. శత్రుత్వము ఒక బలీయమైన కారణము. మహమ్మదీయ చరిత్రలోని కుటుంబ కలహాల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏర్పడ్డ పతనాలు ఇందుకు సాక్ష్యం. ఆధునిక ఐరోపా చరిత్రలో కూడా ఇలాంటి సంఘటనలే ఏర్పడ్డాయి. శత్రుత్వం కంటె సంచయేచ్ఛ బలోపేతమై ఉండి ఉంటే ప్రపంచం ఇంతకంటె కొంత సుఖపడి ఉండేది. కాని గొప్పవారిలో చాలామంది తన శత్రువుల సర్వనాశం

కోసం బుక్కా ఫకీర్లై పోవడానికి సంతోషపూర్వకంగా అంగీకరిస్తారు. అందుకే ప్రస్తుతీ అధ్వాన్నస్థితి ఏర్పడింది.

ఆడంబరం ఒక అత్యంత బలీయమైన కారణం, 'నన్ను చూడు' 'నన్ను చూడు' అనే పిల్లల మనస్తత్వంలో మానవ హృదయంలోని ఈ మౌలిక వాంఛను మనం గుర్తించగలం. విదూషకత్వం నుండి కీర్తిశేషులవ్వాలనుకునే వరకు ఇది లెక్కలేనన్ని రూపాలు ధరిస్తుంది. మరణశయ్యమీదనున్న ఒక ఇటాలియన్ రాకుమారుణ్ణి మతగురువు నువ్వు ఎందుకైనా పశ్చాత్తాపపడుతున్నావా? అని అడిగితే ఆరాకుమారుడు ''అవును. ఒకసారి ఒక మతగురువు, చక్రవర్తి ఇద్దరూ కలిసి నన్ను చూడవచ్చారు. వారిద్దరిని క్రిందకు పడదోసే అవకాశాన్ని నేను జారవిడుచుకున్నాను. ఆ పనిచేసి ఉంటే నాకు అజరామరకీర్తి లభించి ఉండేది'' అన్నాడట. ఆడంబరంలో ఉన్న చిక్కేమిటంటే అది తనను తాను పెంచి పోషించుకుంటుంది. నీ గురించి పొగడుతూన్నకొద్దీ ఇంకా పొగిడించుకోవాలని ఉంటుంది. మరణశిక్షను పొందబోతున్న నేరస్తుడికి వారి విచారణకు సంబంధించిన వార్తా పత్రికను చూడడానికి అనుమతి నిస్తే తనకు సంబంధించిన వార్త అసంపూర్ణంగా ఉండడం చూసి మండిపడతాడు. ఇతర పత్రికలు కూడా చూస్తూ ఇంకా తక్కువగా రాసినవారిని చూసి ఇంకా ఇంకా మండిపడతాడు - రాజకీయవాదులు, సాహిత్యకారులు కూడా సరిగ్గా ఇలాంటివారే. వాళ్ళకు పేరు ప్రతిష్ఠలు పెరుగుతూన్న కొద్దీ వాళ్ళను తృప్తిపరచాలనుకునే కష్టాలు పెరుగుతాయి. మూడేళ్ళ అర్భకుని దగ్గరనుండి లోకాన్ని గడగడలాడించే నిరంకుశాధికారి వరకు మానవజీవితంలోని వివిధ దశలలో ఆడంబరానికున్న ప్రభావం ఎంతటిదో చెప్పడం అంత తేలికైన విషయం కాదు. మానవాళి తమనుండి నిరంతర స్తుతిని ఆశించే భగవంతుడికి కూడా ఈ ఆడంబరమనే అపవిత్ర భావనను అంటగట్టింది.

అన్ని కోరికలను మించినది అధికారవాంఛ. పదవీ వ్యామోహం. ఇది ఆడంబారానికి ఆత్మబంధువు; కాని అంతకంటె భిన్నమైనది. ఆడంబారానిక పదవి లేకున్నా ఫరవాలేదు; అతిశయం ఉంటే అది తృప్తి పడుతుంది. అమెరికాలో సినీతారలకు అతిశయమెక్కువ. కాని వారిస్థానం అంతగా అతిశయం లేని ఇతర కమిటీల ద్వారా నియమిత మౌతుంది. ఇంగ్లండులో ప్రధానికంటె రాజుకు అతిశయమెక్కువ. ప్రధానికి రాజుకంటె అధికారమెక్కువ. చాలామంది అధికారం కంటె అతిశయాన్నే వరిస్తారు. కాని పదవిని వరించిన వారికి వీరికంటె పలుకుబడి ఎక్కువగా ఉంటుంది. 1814లో బ్లూచెర్ నెపోలియన్ భవనాలను చూసి ''వీటన్నిటినీ వదలి మాస్కోకు పరుగెత్తిన నెపోలియన్ ఎంత మూర్ఖుడు!'' అన్నాడట. కాని నెపోలియన్ ఆడంబరం కంటె అధికారాన్ని వరించిన వాడు. ఆడంబరంలాగే పదవీవ్యామోహం కూడా తృప్తి చెందదు. భగవంతుడి సంపూర్ణాధికారం ధారాదత్తం చేస్తే తప్ప, అంతకంటె తక్కువతో అది తృప్తిపడదు. ప్రముఖవ్యక్తుల జీవితాలను నడిపించిన కారణాలలో ఇది బలీయమైనది.

అధికారం అనుభవంలోకి వచ్చినకొద్దీ దానిమీద వ్యామోహం పెరుగుతూ ఉంటుంది. వంశపారంపర్య హక్కుదార్లుకి, చిన్న అధికారులకి కూడా ఇది వర్తిస్తుంది. 1914కి ముందు ప్రపంచం సుఖంగా ఉండే రోజుల్లో సంపన్న గృహిణులు నౌకర్లు ఛాకర్లను కూర్చుకుని వాళ్లమీద పెత్తనం

చలాయిస్తూ ఆనందించేవారు. అధికారం వల్ల సంక్రమించే సుఖాలు అనుభవంలోకి వస్తూన్న కొద్దీ నిరంకుశపాలన అన్నింటిలోనూ పాశవిక ప్రవృత్తి పెరుగుతూ వచ్చింది. మనుష్యులమీది అధికారం వాళ్లచేత చేయించకూడని పనులను చేయించడంలో ప్రకటితమయింది. అధికార వ్యామోహంతో ప్రేరితుడైన మనిషి ఇతరుల సుఖాన్ని అనుమతించక వాళ్లమీద బాధల్ని రుద్దడానికి తగి ఉంటాడు. నిజమైన అవసరం కోసం సెలవు కావాలని నీ అధికారిని అడిగినప్పుడు అంగీకరించడం కంటె తిరస్కరించడంలోనే అతని అధికారం తృప్తి పడుతుంది. భవన నిర్మాణానికి అనుమతి కావాలని నువ్వు అడిగినప్పుడు ఒక చిన్న గుమాస్తా! సరే! అనడంలో కంటె! వీల్లేదు అనడంలోనే ఎక్కువ తృప్తి పడతాడు. అందుకే పదవీవ్యామోహం అంత భయంకర కారణమయింది.

కాని ఇందులో వాంఛనీయమైన పార్శ్వాలు కూడా ఉన్నాయి. జ్ఞానతృష్ణ పదవీవ్యామోహంతో ప్రేరిత మౌతంది. విజ్ఞాన శాస్త్ర పురోగతికి ఇది కారణ మౌతుంది. రాజకీయాలలో సంస్కర్తలకు కూడా నియంతల కున్న బలమైన పదవీవ్యామోహం ఉండవచ్చును. అందుచేత పదవీవ్యామోహం పూర్తిగా నిరసించదగిన లక్షణమనుకోవడం తప్పు. పదవీవ్యామోహాన్ని సంఘానికి ఉపయోగకరంగా ఉపయోగిస్తావా, లేక సంఘవినాశనానికి ఉపయోగిస్తావా అనేది నీ సామర్థ్యం మీద, అప్పటి సామాజిక వ్యవస్థ మీద ఆధారపడి ఉంటుంది. రాజకీయవాది బలం ఎక్కువగా ఉన్న పార్టీలోకి తరచుగా కప్పదాట్లు వేస్తూ ఉండవచ్చును. కాని కొందరు రాజకీయవాదులు ఒక పార్టీనే నమ్ముకుని, పదవీ వ్యామోహాన్ని అణచిపెట్టి ఉంచగలరు. వివిధ మనస్తత్వాలు గల వేరు వేరు వ్యక్తులలో పదవీవ్యామోహం నిర్మలంగా ఉండే అవకాశం కూడా ఉంది.

ఇంతవరకు మనం పరిగణించిన మౌలిక కారణాల కంటె కొంచెం తక్కువస్థాయివైనా, గుర్తించదగిన ప్రాముఖ్యం గల కొన్ని ఇతర కారణాలను గురించి ఇప్పుడు చెప్తాను. వీటిలో భావావేశం మొదటిది. జంతు ప్రదర్శన శాలలోని కోతుల్లాగా అలియగొట్టే భావావేశంతో మూర్ఖుల ముందు కొందరు వ్యక్తులు తమ ఆధిక్యాన్ని ప్రదర్శిస్తూ విసుగెత్తించడంలో తమకున్న సామర్థ్యాన్ని ప్రదర్శిస్తూ ఉంటారు. అది ఎంతటిదైనా సరే. మనుష్యులందరిలోనూ విసుగుదల నుండి తప్పించుకోడం ఒక బలమైన కోరికగా అనుభవం మీద తెలిసి వస్తుంది. తెల్లవాళ్లు మొదట అకలుషిత ఆదిమ జాతులతో సంపర్కం పొందినప్పుడు వాళ్లకు ఏసు సువార్త నుండి బూడిదగుమ్మడికాయ హల్వాదాకా ఎన్నో రకాల లాభాలను ఇవ్వజూపుతారు. ఎక్కువమంది ఆదిమ జాతులు భేదభావం ఏమీలేకుండా వాటిని స్వీకరిస్తారు. మనం ఇచ్చే బహుమతుల్లో వాళ్లు విలువైనవిగా భావించేవి మత్తు పానీయాలు. జీవితంలో మొదటిసారిగా లభించే కొద్దిక్షణాల ఆ ఊహాస్వర్గానికి లోబడి, చనిపోవడం కంటె బ్రతికి ఉండడమే మేలని వాళ్లనుకుంటారు. ఇంతవరకు తెల్లవారి చేత ప్రభావితులు కాని రెడ్ ఇండియన్లు, మనలా సుతారంగా కాకుండా మూర్ఛపోయే పర్యంతం దమ్ములాగుతూ తమ పైపుల్ని పీలుస్తారు. నికోటిన్ ఉద్రేకం పూర్తిగా విఫలమైతే, ఒక దేశభక్తి పూరితుడైన ఉపన్యాసకుడు పొరుగు జాతిమీద దండెత్తవలసిందిగా ఉద్రేకపరిచినప్పుడు, మనకు గుర్రప్పందేల్లోనూ జనరల్ ఎలక్షన్లలోను పుట్టినంత భావావేశం వాళ్లకు కలుగుతుంది. జూదం ఆడ్డంలోని వేడుక అంతా భావావేశంతోనే నిండి ఉంటుంది. చలికాలంలో

చైనాగోడ దగ్గర జూదమాడి నగదంతా పోగొట్టుకుని, వ్యాపార సరకులన్నింటినీ ఓడి, బట్టలు కూడా ఒడ్డి దిగంబరంగా చలిలో కొయ్యబారి మరణించే చైనా వ్యాపారులను గూర్చి మాన్సియర్ హుక్ వర్ణించాడు. యుద్ధం వచ్చిందంటే ఆదిమ రెడ్ ఇండియన్ తెగలనుండి నాగరక సమాజం వరకు ప్రజానీకం అంతా భావావేశానికి లోనవుతారు. ఫలితాలు ఎంత విపరీతమైనవైనా ఆ భావావేశం ఒక ఫుట్‌బాల్ ఆటలోని ఆవేశంతో సమానమైనదిగా ఉంటుంది.

ఈ భావావేశానికి మూలకారణమేమిటో నిశ్చయించి చెప్పడం కష్టం. మనిషికి వేట జీవనోపాధిగా ఉండే టప్పటి మానసికస్థితి ఈ దశలో ఆరోపితమవుతుందని నాకనిపిస్తుంది. గుహల్లో జీవించే మనిషి తన మొద్దు పనిముట్లతో రోజల్లా వేటాడి రాత్రి భోజనానికి ఒక దుప్పి కళేబరాన్ని విజయగర్వంతో, తృప్తినిండిన అలసటతో, దాన్ని గుహముఖంలో పడేసి, తన భార్య వండుతుండగానే ఒక కునుకు తీస్తాడు. ఆ వంటవాసన నాసారంధ్రాల్లోంచి నవనాడుల్లోకి పాకి అతని ఎముకలు మూలుగుతాయి. అప్పుడు లేచి కడుపునిండా తిని మస్తుగా నిద్రిస్తాడు. అటువంటి జీవితంలో విసుగు చెందడానికి అతనికి సమయమూ ఉండదు; శక్తీ ఉండదు. కాని అతడు వ్యవసాయదారుడైనప్పుడు, పొలాల్లోని శ్రమనిండిన పనంతటినీ భార్యకు అప్పగిస్తాడు. అప్పుడతని మానవ జీవనాడంబరంలోకి తొంగి చూడడానికి సమయం దొరుకుతుంది. పురాణాలు వేదాంత దర్శనాలు కనిపెట్టే కాలం సమకూరుతుంది. జీవితాన్ని గూర్చి కలలు మొదలౌతాయి. కఠోరమైన శారీరకశ్రమకు మన మానసిక సంసిద్ధత అమరి ఉంది. నా చిన్నతనంలో, సెలవుల్లో ఎక్కువగా నడచేవాడిని. రోజుకు 25 మైళ్ల దాకా నడచినప్పుడు సాయంత్రానికల్లా ఎంతో ఉల్లాసంగా, విసుగు అనేది తెలియకుండా హాయిగా చతికిలబడేవాడిని. కాని ఆధునిక జీవితం ఈ విధమైన కష్టసహిష్ణుతగల శారీరక సూత్రాల మీద నడవడం లేదు. ఇప్పుడు కాలు కదపకుండా చేసేపనులే ఎక్కువ. కాయకష్టంతో కూడిన పనులైతే కొన్ని ప్రత్యేక కండరాలకే పరిమితమై ఉంటుంది. నీతి బోధకులు, సంఘసంస్కర్తలు ఈ విషయాన్ని అంతగా పట్టించుకోవడం లేదు. సంఘ సంస్కర్తలు ఇంతకంటె గంభీరమైన విషయాలను గూర్చి ఆలోచిస్తున్నా మనుకుంటారు. నీతిబోధకులు పాపానికి సంబంధించిన భావావేశానికి విడుదల కల్పించే మార్గాలను గూర్చి తీవ్రంగా ఆలోచిస్తూ ఉంటారు. నర్తనశాలలు, సినిమాలు, జాజ్ సంగీతం, ఇవన్నీ నరకద్వారాలు. అక్కడకు వెళ్లేకంటె మన పాపాలను మననం చేసుకుంటూ మన ఇంట్లోనే తలుపువేసుకుని కూర్చోవడం మంచిది. ఇలాంటి హెచ్చరికలు చేసే ప్రమాదకరవ్యక్తులతో సమాధానపడడానికి నేను పూర్తిగా అశక్తుణ్ణి. దయ్యానికి అనేకరూపాలు. కొన్ని యువకుల్ని, కొన్ని వృద్ధుల్ని గంభీరుల్ని మోసగించడానికి రూపొందించబడ్డాయి.

భావావేశానికి సంబంధించిన అనేకరూపాలు వినాశకరమైనవి. హద్దు మీరిన త్రాగుడు, జూదం వాటిలో నిరోధించడానికి వీలుకానంతటి వినాశనాన్ని కలిగిస్తాయి. జనం గుంపులుగా దొమ్మికి పాల్పడినప్పుడు అది వినాశకరమైన రూపాన్ని ధరిస్తుంది. యుద్ధం వస్తే అది వీటన్నిటికంటె వినాశకారి అవుతుంది. భావావేశానికి మరీ సరళమైన, అమాయకమైన బహిర్గమన మార్గాలు దొరకనప్పుడల్లా అది ఇలాంటి వినాశకరమైన మార్గాలను అన్వేషించే అవసరంలో పడుతుంది. ఆటలు భావావేశానికి ఆరోగ్యకరమైన నిర్గమన మార్గాలు. రాజ్యాంగ నిబంధనలను అధిగమించని రాజకీయ ధోరణి కూడా

ప్రమాదం లేనిదే. విపరీత భావావేశానికి దారితీసే రాజకీయ ధోరణి కూడా హానికరమైనదే. నాగరక జీవనం ఏమాత్రం హానిలేనిది. ఆదిమ జాతులు వేటతో తృప్తిపడిన రీతి హాని లేని భావావేశ నిర్గమన మార్గాలను నాగరక జీవనం అందించాలి. ఆస్ట్రేలియాలో కుందేళ్లు ఎక్కువ. అక్కడి జనసాధారణమంతా వేలకొద్దీ కుందేళ్లను నేర్పుగా ప్రాచీన మార్గంలో చంపుకుని తిని ఆకలి తీర్చుకోవడంలో ఒక తృప్తి ననుభవించడం నేను చూసేను. కాని ఇంగ్లండులో, న్యూయార్కులో ఆకలి తీర్చుకోవడానికి ఇంకో రకమైన మార్గాన్ని కనుక్కోక తప్పదు. ప్రతి పెద్ద పట్టణంలో జనం తొక్కుతూ నడవడానికి వీలుగా ఉండే చిన్న పడవలతో నిండిన కృతక జలపాతాలుండాలని నేననుకుంటాను. అందులో మరచేపలతో నిండిన స్నానఘట్టాలు కూడా ఉండాలి. యుద్ధాన్ని ప్రేరేపించే వాడెవడైనా సరే వాణ్ణి రోజుకు రెండుగంటలు ఈ జల జంతువుల మధ్య పడెయ్యాలి. భావావేశాన్ని నిర్గమింపజెయ్యడానికి నిర్మాణాత్మకమైన మార్గాలను కనిపెట్టడానికి మనం శ్రమించాలి. నూతనగవేషణ, నూతన సాధన అనేవి లోకంలో కల్లా గొప్ప భావావేశకారులు అవి ఆలోచనలో ఉన్నప్పుడు కంటె అనుభవంలోకి వచ్చేటప్పటికి చాలా మంది ఆ భావావేశాన్ని అనుభవించ గలుగుతారు.

అనేక ఇతర రాజకీయ కారణాలతో చిక్కుపడిపోయిన రెండు గాఢమైన ప్రలోభాలు మానవుల్ని మరీ పతనం పొందేలా చేస్తాయి. అది భయము - ద్వేషము. సహజంగా మనం దేనికి భయపడతామో దానిని అసహ్యించుకుంటాము. తరచుగా మనం అసహ్యించుకునే దాన్ని చూసి భయపడడం జరుగుతుంది. ఆదిమ జాతులు అపరిచితమైన దానినల్లా చూసి అసహ్యించుకునే వారని, భయపడేవారని నేననుకుంటాను. ప్రాధమికంగా వాళ్లొక చిన్న తెగలోని వాళ్లు. శత్రుత్వానికి ప్రత్యేకమైన కారణమంటూ ఏర్పడనంతవరకు ఆ తెగలోని వారంతా స్నేహితులుగా ఉండేవారు. ఇతర తెగల వారందరూ వారికి శత్రువులే. అందులో ఎవడైనా ఒంటరిగా చిక్కితే చంపేసేవాళ్లు. పరిస్థితులను బట్టి ఇతర తెగలను దూరంగా ఉంచేవారు. లేదా వాళ్లతో పోరాడేవారు. ఈ ఆదిమ లక్షణమే ఇప్పటికీ విదేశాలపట్ల మన సహజప్రతిస్పందనలను నియమితం చేస్తూ ఉంటుంది. ఊరి పొలిమేరలు ఎప్పుడూ దాటనివాడు ఇతర తెగలకు చెందిన విదేశీయుల్ని ఎంతో కఠినులుగా, క్రూరులుగా ఊహించుకుంటాడు. కాని దేశాలన్నీ తిరిగి, ప్రపంచ రాజకీయాల నెరిగిన వాడు తన తెగ అభివృద్ధికి ఇతర తెగలతో సంపర్కం అవసరమని తెలుసుకుంటాడు. మన శత్రువులను ద్వేషించేవారిని మనం ప్రేమిస్తాం. మనకు శత్రువులే లేనప్పుడు మనం ప్రేమించేవారి సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది.

ఇతర మానవాళి పట్ల మన కేర్పడే దృక్పథాన్ని బట్టి ఇందులోని నిజం నిలుస్తుంది. కటాకటీగా చాలినంత పండే నీ నేలను నువ్వు ద్వేషించవచ్చును. ప్రకృతి మాతను నీ శత్రువుగా పరిగణించి ఇంతకంటె గొప్ప ప్రకృతిని సాధించే సంఘర్షణగా మానవజీవితాన్ని గూర్చి నువ్వు ఊహించుకోవచ్చును. మనుష్యులంతా జీవితాన్ని ఇలా చూస్తే మానవజాతి అంతా చెయ్యీ చెయ్యీ కలపడం సులభమవుతుంది. విద్యాలయాలు, పత్రికలు, రాజకీయవాదులు ఈ చరమ లక్ష్యానికి అంకితమైతే మనుష్యులందరికీ సులభంగా ఈ దృక్పథం అలవడుతుంది. కాని మన బడులు దేశభక్తిని బోధించడానికే ఉన్నాయి. పత్రికలు భావావేశాన్ని రెచ్చగొట్టేటందుకే ఉన్నాయి. రాజకీయవాదులంతా తిరిగి ఎన్నికకావడం కోసమే ఉన్నారు. కాబట్టి పరస్పర ఆత్మహత్యలకు పాల్పడే మానవాళిని కాపాడేందుకు వీరు చేయగలిగిందేమీ లేదు.

భయాన్ని సమర్థంగా ఎదుర్కొనే మార్గాలు రెండున్నాయి. ఒకటి బాహిరమైన ప్రమాదాన్ని తగ్గించుకోవడం. రెండవది ఓరిమినిండిన ఆత్మ నిగ్రహాన్ని అలవరచుకోవడం. తక్షణ ప్రతి స్పందన అవసరమైనప్పుడు తప్ప ఇతరసందర్భాలలో భయకారణం నుండి మన ఆలోచనలను మళ్లించుకోవడంతో 'ఓర్మిని' ఆత్మ నిగ్రహాన్ని పెంచుకోవచ్చును. భయాన్ని జయించడం చాలా ముఖ్యం. అదొకగొప్ప నిరోధకం. అది బయహేతువైన దానిమీద ద్వేషాన్ని పెంచి మనలో అలవిమీరిన క్రౌర్యాన్ని కలిగిస్తుంది. భద్రతాభావం కంటె మానవాళిని ప్రభావితం చేసే లాభకరమైన హేతు వింకొకటి లేదు. యుద్ధ భయాన్ని తొలగించే అంతర్జాతీయస్థితి ఏర్పడాలంటే మానవాళి దైనందిన చింతన త్వరితగతిన విస్తృతపరిధిలో వికసించాలి. ఇప్పుడు ప్రపంచాన్ని భయం నీడలు కమ్ముకున్నాయి. బుద్ధి హీనులైన కమ్యూనిస్టులు, కేపిటలిస్టులు సృష్టించిన అణుబాంబులు, క్రిమి జనక బాంబులు వాషింగ్టన్‌ను, క్రెమ్లిన్‌ను వణికిస్తూ ప్రజల్ని పాతాళగహ్వరంలో పడదోసే మార్గాలోకి నెట్టుతున్నారు. పరిస్థితులు మెరుగైతే మున్ముందుగా యుద్ధభయాన్ని నివారించే చర్యలు చేపట్టాలి. ప్రపంచం ఇప్పుడు విరుద్ధ సిద్ధాంతాల మధ్య నిరోధింపబడి ఉంది. ఒక సిద్ధాంతాన్ని జయించాలని ఇంకొక సిద్ధాంతం ప్రయత్నించడమే ఇందుకు స్పష్టమైన కారణంగా కనిపిస్తూంది. కాని శత్రుగణాలమధ్య ఏర్పడ్డ గాఢ ప్రలోభాలే ఇందుకు కారణం గాని ఇది సిద్ధాంతాల సంఘర్షణ అని నేననుకోను. కమ్యూనిస్టులను ద్వేషించడానికి చాలా కారణాలున్నాయి. అన్నిటికంటె ముందు వాళ్ళు మన ఆస్తుల్ని స్వాధీనం చేసుకుంటారని మనం నమ్ముతాము. వాళ్లకు మతం లేకపోవడం మనం ద్వేషించే రెండవకారణం. కాని చైనావారికి 7వ శతాబ్దినుండి మతం లేదు. కాని వాళ్లు చాంగ్‌కైషేకు మీద తిరగబడిన నాటి నుండి మనం వాళ్లను ద్వేషిస్తున్నాము. కమ్యూనిస్టులను ద్వేషించే మూడవకారణం వాళ్లకు ప్రజాస్వామ్యంలో నమ్మకం లేకపోవడం. వాళ్లు స్వేచ్ఛను హరించడం నాలుగోకారణం. కాని వాళ్లను ద్వేషించడానికి ఇవేవీ కారణాలు కావు. వాళ్లంటే మనకు భయం కాబట్టి మనల్ని వాళ్లు బెదిరిస్తున్నారు కాబట్టి వాళ్లను మనం ద్వేషిస్తున్నాము. ఇది ఆదిమ తెగలకు సంబంధించిన భావన. మనిషి ఇతరమైన ప్రతి సిద్ధాంతాన్ని వింతగా చూస్తాడు. దానిని భయకారణంగా భావిస్తాడు. సిద్ధాంతులు తెగలు సృష్టించిన పద్ధతులు. వాటి వెనుకనున్న మనస్తత్వం చాలా వరకు ఒకలాగే ఉంటుంది.

అనుకంప (Sympathy) నికార్సైన కారణ మనడంలో ఎవరికీ విప్రతిపత్తి ఉండదనుకుంటాను. ఇతరుల కష్టాలను చూసి బాధపడేవారు కొందరుంటారు. ఈ అనుకంప గత శతాబ్దిలో అనేక విధాల మానవతా పురోగతిని సాధించింది. మతిభ్రమ పొందిన వారిని హింసించే కథలను విని మనం విస్తుపోయాము. ఇప్పుడు వారికి రక్షణ కల్పించి, శ్రద్ధగా సాకే చికిత్సా కేంద్రాలేర్పడ్డాయి. పాశ్చాత్య దేశాలలో ఖైదీలను బాధపెట్టడానికి ఇప్పుడు వీలులేదు. అలా ఏమైనా జరిగితే దానిని అందరూ నిరసిస్తారు. అనాథల్ని ఆలివర్ ట్విస్టులో లాగ చూడడాన్ని మనమిప్పుడు అంగీకరించం. ప్రొటెస్టెంటు దేశాలు జంతు హింసను వ్యతిరేకిస్తాయి. ఈ మార్గాలన్నిటిలో అనుకంప రాజకీయంగా ఎంతో ప్రభావాన్ని చూపింది. యుద్ధభయంపోతే దాని ప్రభావం ఇంకా ఎక్కువగా ఉంటుంది. అనుకంపాతిశయానికి మార్గాలు కనుక్కోవడమే మానవాళి భవిష్యత్తుకు ఆశాకిరణం కాగలదు.

ఈ చర్చను ముగించవలసి వుంది. రాజకీయం వ్యక్తులతో కాక గుంపులతో ముడిపడివుంది. ఒక గుంపులో ఐకమత్యాన్ని సాధించడం, ఇతర గుంపుల్లో విరోధాన్ని పెంచడం అనే ధోరణిమీద

రాజకీయసౌధాలు నిర్మిత మౌతున్నాయి. ఒక తెగలో ఐకమత్యం శతశతాంశం సాధించడం సాధ్యంకాదు. నియమాలను అతిక్రమించే సభ్యులు గుంపులో ఉంటారు. వాళ్లు అన్నిటికీ అతీతులు, సామాన్య స్థితి నుండి కిందకు దొర్లేదీ, మీదకు ఎగసేదీ వీళ్లే. వీరిలో మూర్ఖులు, నేరస్థులు, తాత్త్వికులు, గవేషకులు కూడా ఉంటారు. తెలివైన పార్టీ సామాన్యస్థితి నుండి మీదకు ఎగసినవారి అసామాన్య ప్రవర్తనను నేర్పుగా భరించడం, కింద కూలినవారిని చూసి మరీ కోపగించుకోకపోవడం ద్వారా తెలివిగా వ్యవహరిస్తుంది.

ఇతర పార్టీలతోటి సంబంధాల విషయాలలో ఆధునిక రాజకీయాలలో స్వార్థానికి - సహజాత లక్షణానికి వైరుధ్యం ఏర్పడుతూంది. పూర్వం రెండు తెగల మధ్య యుద్ధం వస్తే ఒక తెగ ఇంకొక తెగను నాశనం చేసి వారి రాజ్యాన్ని ఆక్రమించేది. అప్పుడు విజేతకు పరిపూర్ణమైన తృప్తి లభించేది. యుద్ధం శత్రువులను చంపడానికి ఖర్చు ఉండేది కాదు. అందువల్ల గెలుపు వల్ల లభించే భావావేశం సమ్మతించదగినదిగా ఉండేది. అటువంటి పరిస్థితుల్లో యుద్ధాలు కొనసాగడంలో ఆశ్చర్యపడవలసినది లేదు. దురదృష్టవశాత్తు ఇప్పటి యుద్ధపు తీరుతెన్నులన్నీ మారిపోయాయి. అయినా అప్పటి ఉద్రేకాలు మాత్రం మిగిలి ఉన్నాయి. ఆధునిక యుద్ధాలలో శత్రువును చంపడం చాలా ఖర్చుతో కూడినపని. ఆర్థిక దృష్టితో చూస్తే ఆధునిక యుద్ధపద్ధతి లాభసాటిగా కనపడదు. మనం రెండు ప్రపంచయుద్ధాలు గెలిచిన మాట నిజమే. కాని ఆరెండు యుద్ధాలు రాకుండా ఉంటే ఇప్పుడు మనమెంతో సంపన్నులమై ఉండేవాళ్లము. మనుష్యులంతా స్వార్థంతోనే ప్రవర్తిస్తే వాళ్లమధ్య ఎప్పుడో ఐకమత్యం సిద్ధించి ఉండేది. అప్పుడు యుద్ధాలు, సైన్యాలు, నౌకాసైన్యం, అణుబాంబులు ఏవీ ఉండేవి కావు. ఒక దేశం మీద ఇంకొక దేశం దుష్ప్రచారం చెయ్యవలసిన అవసరం ఉండేది కాదు. సరిహద్దు రక్షణదళాల అవసరం ఉండేది కాదు. కస్టమ్సు నియమనిబంధనల అవసరం ఉండేది కాదు. తమ పొరుగువారి దైన్యాన్ని కోరకుండా ఉంటే, తమ సుఖాన్నే పూర్తిగా ప్రజలు కోరుకుని ఉంటే ఇవన్నీ చాలా త్వరితంగా సిద్ధిస్తాయి. కాని, మీరే చెప్పండి. ఇలాంటి పగటికలల వల్ల ప్రయోజనం ఉందా? నీతివాదులు మనం స్వార్థపరులం కాకూడదంటారు, అలా ఉంటే తప్ప ఈ సహస్రాబ్ది గడవదు.

ఈ వ్యాసాన్ని నిరాశాజనకంగా ముగించాలని నాకు లేదు. స్వార్థం కంటె గొప్ప గుణాలున్నాయని, కొందరు వీటిని సాధించేరని నేనంగీకరిస్తాను. కాని రాజకీయాల వంటి పెద్ద పెద్ద వ్యవస్థలు స్వార్థాన్ని అతిక్రమించి ప్రవర్తించిన సంఘటనలు చాలా కొద్ది మాత్రమే ఉన్నాయని చెప్పగలను. స్వార్థాన్ని ఆత్మరక్షణగా మనం అభివర్ణిస్తే మానవాళి స్వార్థానికి చాలా కింద కూలిన గొప్ప సన్నివేశాలనేకం ఉన్నాయి.

సిద్ధాంతపరమైన కారణాలు తమను నడిపిస్తున్నాయని ప్రజలు సమాధానపడిన అనేక సందర్భాలలోనే వారు ఆత్మరక్షణ అనే భావనకు లోబడిన అనేక సందర్భాలేర్పడ్డాయి. ద్వేషపు ముసుగులో లేదా పదవీ వ్యామోహపు ముసుగులో సిద్ధాంతం చలామణీ అవుతూ ఉంటుంది. ప్రజానీకం ఉన్నతాశయాల మీద ఊగిసలాడుతూన్నప్పుడు, దాని ఉపరితలం కిందుగా దృష్టిసారించి ఆ ఆశయాలు ఫలవంతం కావడానికి కారణాలేమిటో నిన్ను నువ్వు ప్రశ్నించుకోవాలి. చివరగా నేను చెప్పదలచుకున్నది మేధ ఒక్కటి మాత్రమే ప్రపంచాన్ని సుఖపెట్టగలదు. ప్రణాళికాబద్ధమైన విద్యా ప్రగతి వలన మేధ వృద్ధి పొందుతుందనే ఆశావహమైన ముగింపు నిస్తున్నాను.

# సంశయం - సత్యం

మూలం : **శ్రీ పార్థబసూ** అనువాదం : **గూడ శ్రీరాములు**

అర్నాల్డ్ టాయన్బీ ప్రసిద్ధ అధ్యాపకుడు. బహుభాషావేత్త. ప్రపంచ ప్రఖ్యాత చరిత్రవేత్త. బహుగ్రంథ రచయిత. ముప్పై సంవత్సరాల నిరంతర కృషి ఫలితం ఆయన బృహత్ రచన పది భాగాల 'ఎ స్టడీ ఆఫ్ హిస్టరీ'. అది మనిషి సభ్యత, వికాసంపై సమగ్ర చరిత్ర సంగ్రహం. బహుకాల పఠన పాఠనల అనుభవం, పరిశీలనలు ప్రపంచ సమస్యల విశ్లేషణ తీరులో టాయన్బీని ఒక సాధికారిక స్థానంలో నిలబెట్టగలిగాయి. ఎనభై ఆరేళ్ల నిండు జీవితం గడిపి 1975లో ఆయన కన్నుమూశాడు. ''చివరి ఆంగ్లేయుడు''గా గుర్తించబడ్డాడు.

దయిసాకు ఇకెదా 1928లో టోక్యో నగరంలో జన్మించాడు. హీనయాన బౌద్ధమతావలంబకుడు. లక్షన్నరమంది సభ్యులుగల సొకాగక్కాయి అనే బౌద్ధ సంస్థ అధ్యక్షుడు. అనేక విద్యాలయాలు, ఒక విశ్వవిద్యాలయం, ఫూజీ ఆర్ట్ మ్యూజియం మొ॥ వాటి సంస్థాపకుడు. బౌద్ధ సాహిత్యం, మతాల్లోనే కాక సామాజిక, తత్వశాస్త్రాల్లో లోతైన అవగాహన కలవాడు.

ఇకెదా 1971 - 74ల మధ్య ఇంగ్లాండ్ వెళ్లి టాయన్బీతో చాలాసార్లు ముచ్చటించాడు. టాయన్బీ కంటే 39 ఏళ్లు చిన్నవాడైన ఇకెదా శిష్యుడిగా, శ్రోతగా, పాఠకుడిగా టాయన్బీ దృష్టిని అనేకానేక విషయాలపై మళ్లించేవాడు. టాయన్బీ తన అభిమతాలు తెలుపుతూ వుండేవాడు. ఇంటర్వ్యూలు, ప్రశ్నలు - జవాబుల రూపంలో కాక ఆ ఇష్టాగోష్ఠులు అనేక విషయాలపై యథేచ్ఛగా, సుదీర్ఘంగా సాగాయి. అలా సమాజం, సభ్యతల చిరకాల ప్రశ్నల చర్చ ఆ ఇష్టాగోష్ఠుల్లో చోటుచేసుకున్నాయి. అలా ఆ చర్చలు అప్పుడు రికార్డు చేయబడ్డాయి. ప్రచురణకి వీలుగా వాట్ని ఏర్చి, విషయానుసారంగా కూర్చి రిచర్డ్ ఎల్. గేజ్ సంపాదకత్వంలో 'చూజ్ లైఫ్ ' అనే పేరుతో 1987లో గ్రంథరూపంగా ప్రచురించబడింది. అప్పట్లో టాయన్బీ చివరిసారి అనారోగ్యానికి గురైనప్పుడు సంపాదిత పాఠాన్ని స్వయంగా పరిశీలించి సవరించాడు. ముందుమాట కూడా రాశాడు. ఆ ఆంగ్ల గ్రంథం అప్పట్లో మనదేశం చేరివుండొచ్చు. అయితే చాలమంది పాఠకులు, చరిత్రవేత్తల దృష్టిని అది తప్పించుకున్నట్టనిపిస్తున్నది. ఆ ఆంగ్లరూపానికి బెంగాలీ అనువాదం ఆక్స్ఫర్డ్ నుంచి 1994లో ప్రచురణపొందింది.

టాయన్బీ అభిప్రాయాన్ని ఆశిస్తూ ఇకెదా ఒక విషయాన్ని లేవనెత్తేవాడు. ఇకెదాలో ఒక ఉత్సుక పాఠకుడ్ని, శిష్యుడ్ని, ఒక యువ మిత్రుడ్ని చూడగలిగాడు టాయన్బీ. దీర్ఘకాలం నుంచి తనలో రాశిపడిన బౌద్ధిక భారాన్ని బయటపెట్టే అనుకూల పరిస్థితిని టాయన్బీ ఎంచుకున్నాడు. 75 ఏళ్ల వయస్సులో కూడా టాయన్బీ తన అభిప్రాయాల్ని ఒక క్లారిటీ ఆఫ్ మైండ్‌తో వివరించగలిగాడు. ఆయన కొన్ని అభిప్రాయాల్తో ఏకీభావం కుదరకపోయినా అవి పాఠకుల ఆలోచనని రేకెత్తించగలుగుతాయి.

టాయన్బీ తన విశాలమైన చారిత్రకదృష్టి, అనుభవ జ్ఞానాల్తో పాశ్చాత్య దేశాల క్రమ క్షీణతని గుర్తించగలిగాడు. ఈ నిరాశ ఆయన వార్ధక్యం వల్ల కలిగిందనుకున్నా దాన్ని తగినంత చారిత్రక ఆధారాల్తో నిరూపించగలిగాడు. పాశ్చాత్య దేశాలు నేడు ప్రపంచ నాయకత్వస్థానంలో ఉన్నాయనీ, అయితే భవిష్యత్తులో ఆ స్థానం తూర్పు ఆశియా చేతుల్లోకి మారిపోతుందని భవిష్యం పలికాడు.

క్రైస్తవ మతానికి చెందినవాడే అయినా టొయన్బీ ఆ మతంపై తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పగలిగాడు. ''బౌద్ధమత వ్యాప్తి చాలవరకు శాంతి, స్నేహాల మార్గాన జరిగింది. కాని క్రైస్తవమత ప్రత్యేకత స్వాతంత్ర్యవాదం, కొంత అటోక్రటిక్ తత్వం'' అంటాడు. ఐరోపాలోని సాక్సన్ ప్రజలమీద, మెక్సికో - పెరూ మొ॥ లాటిన్ అమెరికన్ దేశాల్లోని కొలంబస్ రాకకి పూర్వపు యుగాల జాతులమీద, రోమన్ సామ్రాజ్యంలోని చాలా భాగాల్లో నివశిస్తూవచ్చిన ఆదినివాసులమీద తన భుజబలంతో బలవంతగా క్రైస్తవమతం రుద్దబడిందంటాడు.

పాశ్చాత్య జాతీయతావాదం గురించి చెబ్తూ ''క్రైస్తవ మతంలోని తోసుకుపోయే గుణం, గుడ్డి మోతుబరితనం ఆధునిక పాశ్చాత్య జాతీయ వాదానికి వారసత్వంగా లభించాయి. అమెరికా, ఫ్రెంచి విప్లవాల్లో అది నిరూపించబడింది. నేటి మోటు జాతీయవాదపు తొంబై శాతం భాగం మనిషి మతభావనలోని తొంబై శాతం భాగం తప్ప మరేమీకాదు'' అంటాడు టొయన్బీ.

కమ్యూనిజాన్ని ప్రస్తావిస్తూ ''క్రైస్తవమతంలో కూడికొనివున్న అసహనం, యూదుల సమస్త అనుసరణల్లోని స్వాతంత్ర్యంతో కూడిన ఆధిపత్య ధోరణికి వశీభూతమైంది కమ్యూనిజం'' అంటాడు టొయన్బీ. అంతటితోనే ఆగిపోక ''చెప్పాలంటే కమ్యూనిజం క్రైస్తవమతానికి చెందిన ఒకానొక అవ్యావహారిక, అప్రతిష్ఠానిక నమ్మకం..... కమ్యూనిజానికీ, యూదు - క్రైస్తవ మత పౌరాణిక కథకీ సామ్యముంది. నిరీశ్వరవాద నిర్వచనంలోని ''చోజెన్ పీపుల్' కమ్యూనిజంలో ''ప్రొలిటారియట్''గా మారింది. ఈ ప్రొలిటారియట్‌ల విజయం ఆ '' ఎంచబడ్డ ప్రజల'' లానే ఐతిహాసిక అనివార్యతలవల్ల పూర్వ నిర్ధారితాలు.... అలానే క్రైస్తవమతంనుంచి కమ్యూనిజం వారసత్వంగా పొందిన మరో అంశం ''సమస్త మానవజాతిని తనలోకి మార్పిడి చేసుకోటం'' అంటాడు. మరికాస్త ముందుకి పోయి ''క్రైస్తవమతం, కమ్యూనిజం మాత్రమే మిషనరీలుకావు, ఇస్లాం, బౌద్ధమతం, విజ్ఞానశాస్త్ర సహాయంతో ప్రగతి సాధించవచ్చునే నమ్మకం - ఇవి కూడా మిషనరీలాంటి మతాలే' అంటాడు. ఈ అభిమతంలో కొంత నిజమున్నప్పటికీ అది మరీ సరళీకరణ అనిపించవచ్చు.

'' ఒక మతాన్నో, లేక తత్వాన్నో అనుసరించకుండా మనిషి జీవించలేడు. ఆ రెంటిమధ్య చెప్పుకోదగ్గ వ్యత్యాసమేదీ లేదు'' అంటాడు టొయన్బీ మరోచోట. ''పదిహేడో శతాబ్దిలో క్రైస్తవమతం వెనుకబడిపోవటం వల్ల ఒక శూన్యస్థానం ఏర్పడింది. క్రైస్తవమతానికి పూర్తిగా వేరైన మరో మూడు కొత్త మతాల్తో ఆ శూన్యస్థానం పూర్తికాబడింది. విజ్ఞాన శాస్త్రాన్ని సాంకేతిక క్రియారూపంలోకి మార్చి దానివల్ల జరిగే అభ్యుదయపు అనివార్యత పట్ల గాఢనమ్మకం, జాతీయవాదం, మార్క్సిజం - అన్నది ఆ మూడు మతాలు'' అంటాడు.

''గుణవంతుల రాజకీయ యంత్రాంగం'' అనే విషయంపై టొయన్బీ ఒక ఆదర్శాన్ని చాటిచెబుతాడు. ''కార్యదక్షులు, లోకహితకరమైన మనోభావ సంపన్నులు కూడా కొన్ని లౌకిక బలహీనతలకి లొంగిపోతారు. అధికారం చెడుమార్గాల్లోకి ఈడుస్తుంది'' అంటాడు. అమెరికా అధ్యక్షుడి ఎన్నికలోనూ, ఎథేనియన్ ప్రజాస్వామ్యంలోని పెరిక్లీస్ తర్వాతి యుగంలో ప్లేటాగోయే చరిత్రలో ప్రజాస్వామ్యంలోని కొన్ని ''నికృష్ట లక్షణాన్ని'' చూడగలిగాడు టొయన్బీ. కనక ఎన్నికల

పద్ధతి సరైనది కాదంటాడు. పాలకుల్ని, ప్రభుత్వ యంత్రాంగం నడిపేవాళ్లని కో- ఆప్షన్, నోమినేషన్ల వల్ల నియమించాలంటాడు. అలా నియమించబడ్డవాళ్లని రాజకీయాలు, ఆర్థిక వ్యవహారాల్తో ఎట్టి సంబంధాలూలేని ప్రముఖ సామాజిక, సాంస్కృతిక సంస్థలు అదుపు చేస్తూ వుండాలంటాడు.

ఈ సందర్భంలో ఇకెదా అడిగిన ప్రశ్న కొంచం వాస్తవసమ్మతం అనిపిస్తుంది. ''ఆధునిక ప్రజాస్వామ్యంలో అర్థవంతమైన బాధ్యత చేపట్టేబదులు చాలమంది వెనుకంజ వేస్తుంటారు. ఏ కొద్దిమంది ఆరితేరినవారు వాళ్ల తాత్విక ఆధిక్యంతో మరిన్ని అధికారాలు చేజిక్కించుకోజూస్తారు. ...... అలాంటప్పుడు మీరంటున్న గుణవంతుల రాజకీయ యంత్రాంగం ఒకవేళ ఏర్పడినా సాధారణ ప్రజలు, ఆ ఆరితేరిన వర్గాలమధ్య దూరం మరీ పెరిగిపోవచ్చు .... ఆ నాయకుల్ని ఎవరు నోమినేట్ చేస్తారు? వాళ్ళ అర్హతలేంటి? అవి ఎలా నిర్ణయించబడ్తాయి?'' అంటాడు ఇకెదా.

''సమస్త ప్రజలమధ్య సమానత్వం నెలకొనాలని నేను ఆశిస్తాను. ఏ వ్యవస్థలోనైతే అన్ని వర్గాల ప్రజల సమాన ఆత్మగౌరవాల్తో తమ వంతు పాత్రలు చేపట్టగలుగుతారో అలాంటి ఒక వ్యవస్థ నిర్మాణాన్ని నేను సమర్థిస్తాను'' అంటాడు ఇకెదా. ఈ సందర్భాన ఇకెదా ఆదర్శవాది అనిపిస్తాడు. ఇకెదా ఈ సదాశయాన్ని టోయన్బీ మరోచోట సమర్థిస్తూ ప్రజల నైతిక స్థాయి, వాళ్ళ బౌద్ధిక సామర్థ్యం మెరుగుపరచడమే అన్నిటికంటె ముఖ్యమైన విషయమని నేను అంగీకరిస్తాను. రాజకీయాల్లో ఔన్నత్యం సాధించాలంటే ఇది సరైన మార్గం. రాజకీయాల్లో ప్రజల చైతన్యం ఇప్పుడు తప్పనిసరి అయింది. దీంట్లో ఎట్టి సందేహానికీ తావులేదు. అయితే దీనికి కాలం అడ్డంకిగా నిలుస్తున్నది. సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పడ్డ త్వరిత పరిణామాలు సామాజిక, రాజకీయ రంగాల్లో కూడా పరిణామాల్ని త్వరితపరిచాయి. రాజకీయాల్ని ప్రమాద స్థితినుంచి బైటికి లాగాలంటే సాధారణ ప్రజల్లో తగినంత నైతిక, బౌద్ధిక స్థాయి పెరగాలి. కానీ అలాంటి స్థాయికి చేరేముందే ఆ ప్రజలు వైపరీత్యాలకి బలి అయిపోతున్నారు'' అంటాడు టోయన్బీ. టోయన్బీ కాస్త వాస్తవికతాబుద్ధి కలవాడనిపిస్తాడు.

విస్తారమైన చరిత్ర పరిజ్ఞానం టోయన్బీ ఆలోచనా రీతినీ, అభిప్రాయ సరళినీ సమృద్ధ పరిచింది. ఒక సత్యాన్ని ఆవిష్కరించటం, దానికి ముఖాముఖిగా నిలబడటంలో విజ్ఞానశాస్త్రపు నైతిక విలువ ఇమిడి వుంటుంది. సాంప్రదాయకంగా కొనసాగుతూవచ్చే సమస్త నమ్మకాలు, ఆచారాల పట్ల అది ఒక సవాలు విసుర్తుంది. అన్ని సమాజాల్లో కూడా లైంగిక సంబంధాల ఆచారాల అనుసరణలూ, వివిధ స్థాయిల్లో వాట్నీ అదుపుచేయటాలు జరిగేవి. ఇది నైతికంగా అవసరమేనని నేను భావిస్తాను. అయితే వాటిపై అదుపులు, నిషేధాలు బిగిసేకొద్దీ అవి అప్పటి నీతిని ఉల్లంఘిస్తాయి. కట్టుబాట్లని తెంచుకుని బైటపడదలుస్తున్నా ఇంకా వాట్నీ దాచిపెట్టటం ఆత్మవంచనే అవుతుంది'' అంటాడు.

80 సంవత్సరాల వయస్సులో కూడా టొయన్బీ అభిప్రాయాలు వెనుకచూపు చూడలేదు. ''ఈ ప్రపంచ పోకడలు, మనిషి జీవితానికున్న అర్థం మొ॥ మూల ప్రశ్నలకి జవాబివ్వటంలో మతగురువులు మతాంధులుగానే ఉండిపోయారు. ఈ మౌలిక ప్రశ్నల్ని చాలమంది వాళ్ల జీవితాల ఏదో ఒక సందర్భంలో అడిగేవుంటారు. వాటి జవాబులు ప్రత్యక్షంగా నిరూపించే రీతిలో ఇవ్వబడలేవు. అని మనిషి సామర్థ్యానికి ఆవలివి. అయినా ఆ ప్రశ్నలు అవసరాలనిపిస్తాయి. వాటి జవాబులు పొందటానికి మనం ఆసక్తి చూపుతుంటాం. మతగురువుల జవాబులు మతమౌఢ్యంగా, మోటుగా ఉంటాయి. వాట్నీ

పరీక్షకి పెట్టి తేల్చలేం. విజ్ఞానశాస్త్రంలా కాక మతం మనిషికి ఒక రహస్య జగత్తు చిత్రాన్ని చూపెడ్తుంది. ఆ చిత్రం నమ్మశక్యంకాని విధంగా వున్నప్పటికీ అది లేకుండా మనం గడపలేకపోతున్నాం'' అంటాడు టొయన్బీ.

ఆస్తికుడైన ఇకెదా మళ్లీమళ్లీ మతం, విజ్ఞాన శాస్త్రాల మధ్య సౌహార్ద్ర ప్రసక్తి తెస్తునేవచ్చాడు. ''ప్రస్తుత విజ్ఞానశాస్త్రం మతాన్ని తోడుగా తీసుకోవాల్సి వుంటుంది. అలానే మతం కూడా వైజ్ఞానిక హేతువుని తనలో ఇమిడ్చుకోవాలి'' అంటాడు ఇకెదా. ''మతాన్ని విడిచిపెడ్తే విజ్ఞానశాస్త్రం కుంటుపడ్తుంది. అదే విధంగా విజ్ఞాన శాస్త్రం విడిచిపెడుతే మతం కుంటిదవుతుంది'' అన్న ఐన్‌స్టీన్ ప్రఖ్యాతమైన అభిప్రాయాన్ని గుర్తుతెస్తూ మతం, విజ్ఞాన శాస్త్రాలమధ్య సమన్వయం సాధించగలిగినప్పుడు సమగ్రమానవజాతిపై ఒక ఉద్దీపక ప్రభావం పడగలుగుతుందని ఇకెదా అభిప్రాయపడ్డాడు. ఇకెదా తన ఈ నమ్మకానికి చేరువగా టొయన్బీని లాక్కొచ్చే ప్రయత్నం చేశాడు. అయితే బుద్ధిబల సంపన్నుడైన టొయన్బీ దీనికి జవాబుగా ''విజ్ఞానశాస్త్రం, మతం మధ్య వైరుధ్యం కల్పించటం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు.... విజ్ఞానశాస్త్రం అనధికారికంగా మతరంగంతో కలుగజేసుకోటం తగదు. నిరూపించవీలుపడని మతాంధ వివరణల్తో తప్ప విజ్ఞానశాస్త్రం మతంలో ప్రవేశించలేదు. ఒకవేళ అది అలా చేస్తే దాని ప్రమాణయోగ్య ప్రత్యేక పద్ధతి స్వవైరుధ్యంతో అణగారిపోతుంది'' అంటాడు టొయన్బీ.

''ఆకలిగొన్న మనిషికి సాహిత్యం ఇవ్వగలిగిందేమీలేదు'' అంటాడు సార్త్ర్. దానికి జవాబుగా ''శాస్త్రీయ పరిశోధనలు మాత్రం ఏమివ్వగలవు?'' అంటాడు టొయన్బీ. ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తూ ''కొన్ని పరిశోధనలు ఎలాంటి సామాజిక లక్ష్యం, ఉద్దేశ్యం లేకుండానే జరిగినా అది కొన్ని సమయాల్లో సమజానికి పనికొచ్చేవే అయ్యాయి. ఈ నిక్కష్ట సత్యం బాగా ప్రచారం కావటంతో ఆర్థిక లాభాలు కొల్లగొట్టటంలోనే నిమగ్నులైన కొన్ని పారిశ్రామిక సంస్థలు వైజ్ఞానిక పరిశోధకులకి ఆర్థిక సహాయాలు, స్కాలర్‌షిప్పులు ఇవ్వటం లాభసాటి అని తలిచాయి. పైగా ఆ ఆర్థిక సహాయాలు ఆశించి శాస్త్రవేత్తలు ఏ నిర్దేశమూ లేకుండానే వాళ్ల విశాలమైన కుతూహలాలకి రూపమివ్వదలిచి ఏ విషయంమీదైనా సరే పరిశోధనలు సాగిస్తారు.'' అంటాడు. విజ్ఞానశాస్త్రంలోని ఈ పరస్పర విరుద్ధ వాస్తవికత సాహిత్య రంగానికి కూడా వర్తిస్తుందని అందరూ ఎరిగిన విషయమే.

''సాహిత్య ప్రభావం'' అనే చర్చలో ఇకెదా, టొయన్బీల మధ్య సాగిన ఇష్టాగోష్ఠి కొన్ని పరస్పర విరుద్ధ అభిమతాల్తో సాగినా కౌతుహలజనకం. ''సాహిత్య లక్ష్యం కొన్ని గిరిగీతల్తో సీమితపరచటం తగదు. ప్రేరణనిచ్చే సాధనంగా సాహిత్యాన్ని తీర్చిదిద్దే చైతన్యం వుండాలి. క్షుత్పీడిత జనాల్ని కాపాడగలిగే సాహిత్యం మనం నిర్మించాల్సి వుంటుందన్నది నా ఆశయం, నమ్మకం'' అంటాడు ఇకెదా. ఇకెదా ఆశయాన్ని టొయన్బీ అంతగా పట్టించుకోలేదనిపిస్తుంది. ''నిజం చెప్పాలంటే కళకోసం కళ అన్నది జీవితం కోసం కూడా. రచయిత తనని తను గొప్పవాడిగా ఊహించుకుని అందరికోసం కాక తనలాంటి ఏ కొద్ది మంది కోసమో ఉత్తసాహిత్యం రచించినప్పుడు ఆ రచయిత తనని గొడ్డువాడిగా నిరూపించుకునేవాడవుతాడు.... సాహిత్య జ్ఞానం, పాండిత్యం కొద్దిమంది కోసమే అయితే అప్పుడది సామాజిక రోగానికొక లక్షణం అవుతుంది'' అంటాడు టొయన్బీ. ఈ చర్చ పాతదే అయినా నిత్యనూతనం.

ఆ తర్వాత మరోచోట ''మేధావి, సాధారణ ప్రజ అనే రెండు భాగాలుగా సమాజం విడిపోయినప్పుడు, ఆ రెండు భాగాలు ఒకదానికొకటి చెందనివిగా భావించబడినప్పుడు అది సామాజిక అస్వస్థకి నిదర్శనం'' అంటాడు టాయన్బీ. పీటర్ ది గ్రేట్ కాలం నాటి రష్యాలో పాశ్చాత్య రీవిపైన వేసుకున్న మేధావుల ఉదాహరణ చూపాడు. తర్వాత ఇష్టాగోష్ఠి మధ్య మళ్లీ ఆ ప్రసక్తి వచ్చినప్పుడు ''మేధావులు, కళాకారులు విశ్వజనీన, శాశ్వత సమస్యల్ని అవహేళన చేసినప్పుడు శుద్ధ మూర్ఖులుగా ఎంచబడ్డారు'' అంటాడు. అయితే విశ్వజనీన శాశ్వత సమస్యల్లో తలమునకలై దేశకాలాలపట్ల ఉదాసీనులైన రచయితల విషయంలో టాయన్బీ అభిప్రాయం ఏథెన్స్‌లో ప్లేటో, జర్మనీలో గెటేల ప్రాసంగిక భూమికలు ఉల్లేఖించబడినా, స్పష్టం కాలేకపోయింది.

టాయన్బీ దృష్టి ప్రపంచలోని చాలా విషయాలపై పడింది. ఆయన భావాలు, పరిశీలనలు, అభిమతాలపై ఒక వైజ్ఞానిక బుద్ధికుశలత పనిచేసింది. ''మనిషి తుచ్ఛుడు, నీచుడు అని మనం అన్నప్పుడు ఆ మనిషిని మనం కించపరచడమే అవుతుంది. మానవ లక్షణపు వైశిష్ట్యత, అర్థవంతత, విశిష్టగుణాలు మనలో లోపించటంవల్లనే అలాంటి తేలిక తీర్పులు మనం చేయగలుగుతామని గుర్తించుకోవాలి. విజ్ఞాన శాస్త్రం అన్ని విధాలా మనిషిని అధమ స్థాయికి దిగజార్చింది. అది మనిషి ఆత్మనీ, మనోశారీరిక అంగాల్నీ కొన్ని సాంకేతిక గుర్తుల్లోకి మార్చేసింది. కంప్యూటర్‌లో జొప్పించటానికి తయారైన కార్డులో మనిషి వ్యక్తిగత పేరుకి బదులు సంఖ్యల్ని వ్యవహరించి మనిషిని ఒక దౌర్భాగ్య వాస్తవికతలోకి నెట్టింది.

ఇష్టాగోష్ఠిలో ఒక చోట మన దేశం, ఈ కాలం సందర్భంరాగా ''ఒక్క రష్యాలో తప్ప మరే దేశంలోకూడా కమ్యూనిజంవల్ల ఆశించిన ఆదర్శ సమాజం ఏర్పడలేకపోయిందని ఆయా దేశాల ప్రస్తుత పరిస్థితులు (1974 నాటికి) తెలుపుతున్నాయి'' అంటూ చర్చని ఎత్తాడు ఇకెదా. దీనికి టాయన్బీ తనపాత అభిమతాన్ని జోడించి ''ప్రొలటారియట్‌ల ఏకాధిపత్యమనే భావనతో యూదులు ''దేవుడి సొంత ప్రజలు'' అనే భావన కలిసిపోయివుంది. ఈ రెండు భావనలుకూడా హేతుదృష్టి కలవి కావు. బలమైన భావనలూ కావు'' అంటాడు.

మన దేశ ప్రసక్తి తెస్తూ ''భారతదేశ దైనందిన జీవితం, సామాజిక ఆచారాల్లో విడదీయరాని విధంగా అక్కడి హైందవ ఐతిహ్యం పెనవేసుకునివుంది. భారతీయ సమాజాన్ని అనేక కులాలుగా విడదీసింది హిందూమతం. అలాంటి భారతదేశాన వర్గపోరాటం, వర్గరహిత సమాజ స్థాపనలాంటి ఆదర్శాల్తో కమ్యూనిజం విప్లవం తేగలుగుతుందా?'' అని ప్రశ్నలేవనెత్తాడు ఇకెదా. ''హేతురహిత హిందూ సమాజంగానీ, అలాంటి మరే దేశంగానీ అన్ని రంగాల్లో సరిసమానంగా పాశ్చాత్యదేశాల్తో పోటీపడి పరుగెత్తలేనప్పుడు ఆ దేశాల్లో కమ్యూనిజం ఎలాంటి ప్రభావం వేయలేద''ని అంటాడు టాయన్బీ.

ఇలా టాయన్బీ, ఇకెదా ఇష్టాగోష్ఠిల్లో అనేక విషయాలు చర్చకి వచ్చాయి. ఆ చర్చల వివరాలన్నీ తెలుపుకుంటూపోతే మరో బృహత్ గ్రంథం అవుతుంది.

### ఇస్మాయిల్ గారి రెండు పీఠికలకు

# కొన్ని సవరణలు - వివరణలు

**- గాలి నాసర రెడ్డి**

హైకు సంకలనాలకు ఇస్మాయిల్ రాసిన పీఠికలు నాలుగు నా దృష్టికి వచ్చాయి. వాటిలో ముఖ్యమైనవి రెండు :

1. 'దృశ్యాదృశ్యం' (బి.వి.వి. ప్రసాద్; ఏప్రిల్ '95) కు రాసిన పీఠిక :

'చంద్రుణ్ణి చూపించే వేలు' (ఇది ఇస్మాయిల్ వ్యాసాదుల సంకలనం 'కరుణ ముఖ్యం' లో కూడా చోటు చేసుకుంది.),

2. 'ఆకాశదీపాలు' (లలితానంద్; జులై '97) కు రాసిన పీఠిక: 'ప్రకృతికి మరలిపో'.

ఈ రెండు పీఠికలకు సంబంధించి కొన్ని విషయాలు నేను చెప్పాలనుకుంటున్నాను. అవి సవరణలుగా, వివరణలుగా హైకు జిజ్ఞాసువులైన పాఠకులకు ఉపకరిస్తాయని భావిస్తున్నాను.

1. ''హైకూ అంటే చంద్రుణ్ణి చూపించే వేలు'' (మొదటి పీఠిక)

ఇస్మాయిల్ చెప్పలేదు గాని ఇది ఆర్. హెచ్. బ్లైథ్ అభిప్రాయం. జె.డబ్ల్యు.హాకెట్ ఇలా అన్నారు:

**"Remember R.H. Blyth's admonition that haiku is a finger pointing at the moon, and if the hand is bejeweled, we no longer see that to which it points".** (హెచ్. జి. హెండర్సన్ రచన **"Haiku in English"** లో ఉదాహృతం. పే. 62)

2. ''నిజంగా హైకూ అనేది పద్యం కాదు; సాహిత్య ప్రక్రియే కాదు. అది సైగ చేస్తున్న చెయ్యి; సగం తెరిచిన ద్వారం; శుభ్రంగా తుడిచిపెట్టిన అద్దం. ప్రకృతికి తిరిగివెళ్లే మార్గం. మన సహజ తత్త్వానికి తిరిగివెళ్లే మార్గం. మన పుష్పతత్త్వానికీ, చంద్రతత్త్వానికీ, పర్ణతత్త్వానికీ, జల తత్త్వానికీ, ఆకాశ తత్త్వానికీ, ఒక్కమాటలో చెప్పాలంటే, మన బుద్ధతత్త్వానికి తిరిగివెళ్లే మార్గం.'' (మొదటి పీఠిక)

ఈ పేరా ('కరుణ ముఖ్యం' లో పునర్ముద్రితమైనప్పుడు కొద్దిగా కత్తిరింపుకు లోనైంది.) ఆర్. హెచ్. బ్లైథ్ ఆంగ్లమూలానికి అనువాదం. అయినా ఈ విషయాన్ని కూడా ఇస్మాయిల్ చెప్పలేదు. అందువల్ల ఈ పేరాలోని అభిప్రాయం, ఉపమానాలు ఇస్మాయిల్ సొంతమే అని పాఠకులు భావించే వీలు కలిగింది. (శిఖామణి తన పుస్తకం 'వివిధ' లోని 'తెలుగు హైకూ ప్రస్తావనలు' అనే వ్యాసంలో ఈ వాక్యాలను ఇస్మాయిల్‌గారి మాటలుగానే ఉదాహరించారు) మూలం చూడండి:

**"A haiku is not a poem, it is not literature; it is a hand-beckoning, a door half-**

**opened, a mirror wiped clean. It is a way of returning to nature, to our moon nature, our cherry blossom nature, our falling leaf nature, in short, to our Buddha nature". (Haiku: Vol. 1; P. 243)**

3. ''..... జపానీయ కవి బషో ప్రసిద్ధ హైకూ:

ఎండిపోయిన కొమ్మ మీద
కాకి ఒంటరిగా కూచుంది
చలికాలపు సాయంత్రం.'' (మొదటి పీఠిక)

దీనికి జపానీయ మూలం:

కరె ఎద ని
కరసు నొ తొమరికెరి
అకి నొ కురె.

జపాన్‌లో ఋతువులు నాలుగు: 1 హరు (**Spring:** ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్), 2. నత్సు (**Summer:** మే, జూన్, జులై) 3. అకి (**Autumn:** ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్), 4. ఫుయు (**Winter:** నవంబర్, డిసెంబర్, జనవరి).

ఇస్మాయిల్ **'autumn'** ను చలికాలంగా అనువదించారు. అంతకు క్రితం నేను శిశిరంగా అనువదించాను (కంజిర పొయిట్రీ బులెటిన్; మే 1994). ఆకురాలు కాలం అనే అర్థాన్ని శిశిరం అనే మాటే స్ఫురింపచేయగలదనుకుంటాను.

4. ''జపానీయ పద్యాన్ని తంక అంటారు. 'మన్యోషూ' అనే కవితా సంకలనంలో (7వ శతాబ్దం నించి 12 వ శతాబ్దం వరకు) దీని ఛందస్సు 5, 7 / 5, 7, 5 మాత్రలతో ఐదు పాదాలు. రెండో పాదం చివర విరామమున్నమాట. తర్వాతి కవితా సంకలనం 'కొకిన్షూ' కాలానికి ఛందస్సు కొద్దిగా మారింది. 5, 7, 5 / 7, 5. విరామం తృతీయ పాదాంతానికి జరిగింది.'' (రెండో పీఠిక)

ఇస్మాయిల్ బ్రాకెట్లలో ఇచ్చిన కాలం ఏమిటో బోధపడడం లేదు. జపానీయ భాషలో ప్రప్రథమ కవితా సంకలనం 'మన్యోషూ' క్రీ.శ. ఎనిమిదో శతాబ్దం మధ్య భాగంలో రూపొందింది. ఇందులో క్రీ.శ. మూడో శతాబ్దం నుంచి సంకలన కాలం వరకు గల దాదాపు 260 మంది కవుల కవితలు సంకలితమయ్యాయి. దీని తర్వాతి కవితాసంకలనం 'కొకిన్షూ' క్రీ.శ. పదో శతాబ్దం ప్రథమార్ధంలో వెలువడింది.

తంకలో 5,7,5,7,5 కాదు 5,7,5,7,7 మాత్రలు ఉంటాయి.

తంకలోని విరామాల గురించి కెనెత్ యసుద తన పుస్తకం **"The Japanese Haiku'**

(పే. 115-123) లో చాలా వివరంగా చెప్పారు. ప్రాచీన జపానీయ గ్రంథాలైన 'కొజికి' (క్రీ.శ. 712), 'నిహొన్ షొకి' (క్రీ.శ. 720), 'మన్యోషూ' లలోనే 5,7,5/7,7, పద్ధతి కూడా అక్కడక్కడా కనిపిస్తుందని యసుద తెలిపారు.

5. ''ఈ మాలికలోని మొట్టమొదటి 5,7,5 మాత్రల పద్యాన్ని హొక్కు అనేవారు. హొక్కు అంటే ప్రథమపద్యమని అర్థం. ఈ హొక్కునే స్వతంత్రపద్యంగా బషో మలిచాడు.'' (రెండో పీఠిక)

హొక్కును స్వతంత్ర పద్యంగా బషో మలిచాడనడం సరికాదు.

క్రీ.శ. 1356లో యొషిమొతొ నిజో (1320- '88) సంపాదకత్వంలో వెలువడిన 'త్సుకుబషూ' లో తొలిసారిగా స్వతంత్ర హొక్కులు కనిపిస్తాయి.

చికర ఇగరషి ఇలా అన్నారు : **"To make the haiku an independent poem, the effort exerted by masters in each period, from Yoshimoto Nijo. through Sogi, Sokan, Moritake, Teitoku, Soin and down to Basho, and the enrichment of the content helped a great deal. However, it is also due to the change occuring in the manner in which the seventeen syllables are read".**

(కెనెత్ యసుద పుస్తకం **'The Japanese Haiku'** లో ఉదాహృతం. పే. 135)

6. ''1686 లో బషో మొదటి హైకూ చెప్పాడు. ఇది జపానీయ సాహిత్యంలో కెల్లా అత్యంత ప్రసిద్ధమైన పద్యం :

పురు యికె య
కవజు నొ తొబికొము
మిజు నొ ఒతొ. (రెండో పీఠిక)

ఈ హైకు అత్యంత ప్రసిద్ధమైనదనే విషయం నిజమే కానీ ఇది బషో మొదటి హైకు కాదు. **"Of all the haiku by Basho that can be dated today, the earliest is the one he wrote in the winter of 1662 at the age of eighteen." ('Matsuo Basho'; P.37)** అన్నారు మకొతొ ఉయెద. అంతేగాక, 'కరె ఎద ని / కరసు నొ తొమరితరు య / అకి నొ కురె' అనే హైకును బషో 1680 లోనే ప్రకటించారు. (తర్వాతి కాలంలో ఈ హైకును బషో కొద్దిగా మార్చారు.)

7. ''హైకూ గురించి కొన్ని అపోహలు మన వాళ్లల్లో పాతుకుపోయినట్లున్నాయి. హైకూ అంటే 17 అక్షరాల పద్యం మాత్రమేనని చాలామంది అభిప్రాయపడుతున్నారు. ...... హైకూ అంటే 17 అక్షరాల పద్యమని చెప్పటమెలా ఉంటుందంటే భావకవిత్వాన్ని నిర్వచించమంటే తేటగీతి ఛందస్సు గురించి చెప్పినట్లుంటుంది.'' (రెండో పీఠిక)

1983 లో 'అంతర్నేత్రం' కవితాసంకలనానికి రాసిన ముందుమాటలో ''హైకు అంటే 17 అక్షరాల పద్యం'' అని ఇస్మాయిల్‌గారే అన్నారు!

నొబుయుకి యుఅస (బషో రచనకు తాను చేసిన ఆంగ్లానువాదం "The Narrow Road to the Deep North and Other Travel Sketches' కు తానే రాసిన 'Introduction' లో) హైకు గురించి చెప్పిన మాటల్ని ఇక్కడ ఉదాహరించడం ఉపయోగకరం.

**"Haiku, or hokku as it was called during the lifetime of Basho, is the shortest among the traditionally accepted forms of Japanese poetry. It consists of seventeen syllables, divided into three sections of five-seven-five.... It is obvious, however, that it is not sufficient to define haiku purely from the standpoint of syllabic structure, for haiku, like any other form in literature, has grown out of a long process, and it is subject to a number of restrictions historically imposed upon it."**

8. ''హైకూలో 17 అక్షరాలని మనవాళ్లు అనుకుంటున్నారు. అక్షరాలు కాదు లెక్క; మాత్రలు. జపాన్ వాళ్లు మాత్రని ఒంజి అంటారు.'' (రెండో పీఠిక)

''హైకు అంటే 17 అక్షరాల పద్యం'' ('అంతర్నేత్రం' పీఠిక; 1983) అనీ, ''17 అక్షరాల మేరలో....'' ('జిబ్రాన్‌సూక్తులు' పీఠిక; 1984) అనీ, ''17 వర్ణాల నియమం'' ('దృశ్యాదృశ్యం' పీఠిక; 1995) అనీ రాసిన ఇస్మాయిల్ ''మనవాళ్లు అనుకుంటున్నారు'' అనడం ఆశ్చర్యకరంగా ఉంది.

''అది పదునేడు నేకాచ్క శబ్దముల పరిమితి గలది'' అని దువ్వూరి రామిరెడ్డి చెప్పారు.

''పదిహేడు శబ్దాలలో అద్భుత చమత్కారాన్ని ప్రపంచించిన హైకూలవంటి ఇంద్రజాలాలున్నాయి'' అని ముళ్ళపూడి వెంకటరమణ 'అమరావతి కథలు' (సత్యం శంకరమంచి; 1978) కు రాసిన ముందుమాటలో అన్నారు.

ఇస్మాయిల్‌కంటె చాలా సంవత్సరాలు ముందుగానే సంజీవదేవ్ ''మూడు పంక్తులు కలిగిన పదునేడు మాత్రల త్రిపద'' అని చెప్పారు. అయినా, ఇస్మాయిల్ తానే మొదటిసారిగా మాత్రలు అని చెబుతున్నట్టు భ్రమకలిగిస్తున్నారు.

ఇంతకు జపానీయ హైకులో 17 'ఒంజి' లేదా 'ఒన్' లు ఉంటాయి. 'ఒన్' అంటే ధ్వని (sound). 'ఒంజి' అంటే ధ్వని సంకేతం (sound symbol or character). 'ఒంజి' ని ఉచ్చరించడానికి ఏకమాత్రాకాలం పడుతుంది.

# ఆధునిక సమాజ సౌధ నిర్మాణ శిల్పి రామమోహన్‌రాయ్

**- శివలింగం**

వైష్ణవభక్తి ఉద్యమం రామానుజునితో ఆరంభం. బలదేవ విద్యా భూషణుడు గౌడీయ వైష్ణవ పరంగా బ్రహ్మ సూత్ర భాష్యం రాశాడు. చైతన్య సంప్రదాయమే గౌడీయవైష్ణవం. బలదేవుని కాలం అస్పష్టం. రామమోహనరాయ్ జననానికి పదిలేక పదిహేను సంవత్సరాలు ముందు 1764 కావచ్చు). బలదేవుని బ్రహ్మ సూత్ర భాష్యం చివరిది. నింబార్కుడు, మాధ్వుడు, వల్లభుడు, చైతన్యుడు దేశానికిచ్చిపోయిన సంప్రదాయాలు క్షీణించసాగాయి. స్వామి నారాయణుడు నూతన విశిష్టాద్వైతాన్ని ప్రభోధించాడు. నైతికతకూ సామాజిక సంస్కరణలకూ ప్రాధాన్యత యిచ్చాడు. సతీసహగమన నిషేధం, శిశుహత్యలు, స్త్రీ విద్య వంటి సామాజిక విషయాలపట్ల శ్రద్ధ వహించాడు.

రామమోహనరాయ్‌తో నూతన యుగోదయం. రామమోహనరాయ్ (1774-1883) దయానందుడు జాతికి ఒక కొత్త మతాన్ని, కొత్త ఆలోచననూ జీవాన్ని జవాన్ని inject చేసిన ఆధునికులు. భక్తి ఉద్యమానికి వ్యతిరేకంగా బ్రహ్మ సమాజోద్యమాన్ని ప్రారంభించాడు రామమోహనరాయ్. తరవాత వచ్చిన కేశవ చంద్రసేన్ భక్తిభావాన్నే పాదుకొల్పాడు. రామమోహనరాయ్ తరవాత బ్రహ్మ సమాజం వారి ప్రభావం నుంచి తప్పుకుంది. విగ్రహారాధనను వ్యతిరేకించాడు. 23 జనవరి 1830లో లౌకిక ప్రాతిపదికమీద మతసదస్సును నిర్వహించి ఆరాధనాసమాజాన్ని నిర్మించాడు. ఇదే బ్రహ్మ సమాజావిర్భావ కాలంగా గుర్తించారు. ఇది సకల మతాల సమైక్య వేదిక. రామమోహన్ అనుయాయులు ఆయన ఆరంభించిన భవనాన్నే ఉపయోగించుకున్నారు. శంకరుడు ప్రస్థాన త్రయానికి భాష్యాలు రాశాక కొందరు సంప్రదాయవాదులు అనుసరించారు. ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, గీత ఈ మూడింటిని ప్రస్థానత్రయి అంటారు. అద్వైతులకూ, అద్వైతేతరులకు ప్రస్థానత్రయి భాష్యాలపై చర్చ చాలాకాలం జరిగాయి. రామానుజుడు గీతమీద రాశాడు. బ్రహ్మసూత్ర భాష్యం శంకరునికి వ్యతిరేకంగా రాశాడు. ఉపనిషత్తులమీద రాయలేదు. నింబార్కుడు బ్రహ్మసూత్రాలమీద రాసి గీత ఉపనిషత్తుల్ని వదిలేశాడు. మొదట మాధ్వుడు, వల్లభుడు తరవాత చైతన్యుడు ప్రస్థానత్రయి సంప్రదాయాన్ని పూర్తిగా తొలగించారు. రామమోహన్ బ్రహ్మసూత్రాలకు భాష్యం సంక్షిప్తంగారాశాడు అందుకనే రామమోహన్ అద్వైతి. గాయత్రి మంత్రం మీద విశ్వాసం వుంది. జందెం ఎప్పుడూ తీయలేదు. ఆశ్చర్యకర విషయమేమంటే బ్రహ్మసభలో వేదాలు వల్లించే సమయంలో బ్రాహ్మణులకు మాత్రమే ప్రవేశానికి అనుమతించడం. బ్రహ్మసమాజీయులకు ఓంతత్ సత్ గురు మంత్రం. ఈ మంత్ర మహిమను, ఆవశ్యకతను వివరిస్తూ గీతను మహా నిర్వాణ తంత్రాన్ని ఉదహరించాడు. తంత్రాభిమాని అద్వైత సాధన మార్గం తంత్రం అన్నాడు. మహాపరి నిర్వాణ తంత్రానుయాయి కావడం నుంచి రామమోహన్‌ను హిందూ పునరుద్ధరణ వాది **(ReviValist)**,

సంస్కరణవాది సామాజికంగా, అనుకున్నారు. కాని ఆయనకు క్రిస్టియానిటి పట్ల అభిమానం వుంది. ట్రినిటీని వ్యతిరేకించాడు, అధిక్షేపిస్తూ హాస్య ధోరణిలో రాశాడు కూడా. హేతు దృక్పథంతో పరిశీలించేవాడు. రామమోహన్ కుల వ్యవస్థను అంగీకరించలేదు.

మాంసాహారం తిన్నాడు, మద్యం సేవించాడు కాని తరవాత వచ్చిన బ్రహ్మసమాజ నాయకులు కేశవ చంద్రసేన్, రాజ నారాయణ బోస్, శివనాధ శాస్త్రి వంటి వారు మద్యాన్ని, మాంసాహారాన్ని నిషేధించారు. 19వ శతాబ్దాంతానికి బ్రహ్మ సమాజవాదులు మద్యాన్ని సేవించడం పూర్తిగా మానుకున్నారు.

రామమోహన్ 23 జనవరి 1830లో **Temple of Universal Worship** ప్రారంభించాడు. నవంబరులో ఇండియా వదిలి ఇంగ్లండు వెళ్ళాడు. 27 సెప్టెంబరు 1833లో మరణించాడు. మరణానంతరం బ్రహ్మసమాజం క్షీణించసాగింది. రవీంద్రుని తండ్రి దేవేంద్ర నాథ టాగూరు సమాజాన్ని రక్షించాడు. రామమోహన్ ఇండియా వదిలి వెళ్ళేప్పటికి దేవేంద్రనాథ్ చిన్నవాడు (1817లో జననం), రామమోహన్ మతాన్ని తత్వాన్ని అర్థం చేసుకోలేదు. ఈశోపనిషత్తులోని ప్రథమ శ్లోకం దేవేంద్రునికి అర్థం కాలేదు. సంస్కృత పండితుని అడిగి తెలుసుకున్నాడు. రామమోహన్ రచనలను చదవలేదు. తరవాత కాలంలో చదివి వుంటాడు. రామమోహన్ అద్వైతి - దేవేంద్రనాథ్ ద్వైతి. ఉపాసన పరంపర ద్వారా ఆత్మ సాక్షాత్కారాన్ని పొందవచ్చు. వర్ణాశ్రమ ధర్మాలను పాటించకుండానే బ్రహ్మ జ్ఞానం పొందవచ్చు. సన్యాసాన్ని అంగీకరించలేదు. వశిష్టుడు, పరాశరుడు, వ్యాసుడు, జనకుడు వంటి వేదాంతులు గృహస్తులు, లోకనిరాకరణ వైఖరి లేనివారు. ఏకేశ్వరోపాసకుడు కావడం నుంచి వ్యక్తి స్వేచ్ఛ మీద విశ్వాసం. బెంగాలీలో రాసిన కరపత్రాల్లో కులం, ఆహారం, వివాహం, ఆరాధనలను మతపరమైన ఆచారాలను అపహాస్యం చేశాడు. వేదాంత గ్రంథాల అనువాదాలను శూద్రులు చదవడానికి అనుమతించాడు.

రామమోహన్ ఇండో ఇస్లాం సంస్కృతుల సమ్మేళనోద్యమ ప్రవక్త, కబీరు, దారాషికోలు సంపద్వంతంగా నెలకొల్పిన సంప్రదాయానికి కొనసాగింపే రామమోహన్ సంప్రదాయం.

రామమోహన్ గురించి ప్రముఖులు వర్ణించిన తీరుచూస్తే ఆయన గొప్పతనం అర్థమవుతుంది.

| | | |
|---|---|---|
| యదునాధసర్కారు | - | ప్రవక్త అన్నాడు. |
| వ్రజేంద్రనాథ సీల్ | - | **a precursor, an archtype, a prophet of coming humanity** |

| | | |
|---|---|---|
| రాలిన్సన్ | - | the pioneer in the changes |
| కె.యం. ఫణిక్కర్ | - | the first modern man in India |
| ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా | - | the father of modern India |
| సోవియట్ ఎన్‌సైక్లోపీడియా | - | fore father of bourgeois national movement in Bengal. |
| పయనీర్ అంటే అర్థం | - | beginner of enterprise original explorer. |

రామమోహన్ అన్ని రంగాల్లోనూ ఒక నూతన దృక్పథాన్ని, ఒక కొత్త వెలుగును అందించి దేశాన్ని ఆధునికతలోకి తీసుకుపోయిన మార్గదర్శకుడు.

భారతదేశంలో ఆధునిక రాజకీయ భావాలకు జీవం పోసినవాడు రామమోహన్. స్వాతంత్ర్యం, వ్యక్తి స్వేచ్ఛ, లౌకిక తత్వం ఈనాటికీ దేశంలో సజీవంగా వుండటానికి కారణం రామమోహన్ గొప్పతనమే. వారి నైతిక విప్లవం సమాజాన్ని కదిలించింది. పాతవాటిని ప్రశ్నించే ధైర్యం కలిగించాడు. పత్రిక స్వేచ్ఛకోసం పోరాడాడు. ఆర్థిక సామాజిక ప్రగతికి పత్రికలే పునాది. న్యాయ పరిపాలన ప్రజలకు అందుబాటులోకి రావాలనే ఉద్దేశ్యంతో నేర పౌరశిక్షాస్మృతులను ప్రచురించాలన్నాడు. నేర శిక్షా స్మృతిలో సరళ సూత్రాలు, స్పష్టమైన నిర్వచనాలు వుంటే అది crminal justiceకి ప్రామాణిక మవుతుందన్నాడు.

రామమోహన్ ప్రాచీన భారతదేశానికి అనుగుణంగా ఆదర్శసమాజాన్ని నిర్మించదలచాడు. ఈ సమాజంలో మానవులు నిజమైన ధార్మిక సూత్రాలను అనుసరించి జీవిస్తారు. సమర్థ పాలన వుంటుంది. ప్రజలు స్వేచ్ఛను అనుభవిస్తారు. ప్రాచీన భారతంలో స్త్రీలు ఆస్తిహక్కులు, స్వేచ్ఛను అనుభవించారు. స్త్రీలు పురుషులకన్నా హీనులుకారు. బానిసలుగా బతకాల్సిన అవసరంలేదన్నాడు. అవకాశం వుంటే స్త్రీలూ విజ్ఞానవంతులు కాగలరు. సామాజిక రాజకీయ తాత్విక ప్రధాన భూమిక భగవంతుని మీద విశ్వాసం, ఏకేశ్వరారాధన, ధర్మమే సమాజానికి మూలం. పాశ్చాత్య సంస్కృతిని పూర్తిగా అనుకరించలేదు. ప్రాచ్యపాశ్చాత్య సంస్కృతుల మేలిమిని స్వీకరించాడు. పరంపరగా వస్తున్న ఆలోచనా ధోరణుల్లో మార్పును కోరాడు. జీవన పరిస్థితులమీద పాశ్చాత్య ప్రభావాన్ని ప్రసరింపచేశాడు. బేకన్ లాక్, బ్లాక్‌స్టోన్, బెంథం వంటి మేధావుల రచనలు చదివాడు. అరబ్, పర్షియా, ఇస్లాంతత్వాలను పరిశీలించాడు. రాజకీయ తత్వవేత్తకాడు. ఆధునిక సామాజిక వేత్తకాదు. సమాజ పునర్నిర్మాణ శిల్పి. రామమోహన్ ఒక మహోన్నత మానవతామూర్తి.

# విమర్శకుడు - శ్రీశ్రీ

- యం. మల్లారెడ్డి

శ్రీరంగం శ్రీనివాసరావు విమర్శకుడుగా అతని కవిత్వంలోనే సాక్షాత్కరిస్తాడు. ఆయన 'మహా ప్రస్థానం'లోని ఖండికలను బట్టి, ఆయన రచించిన 'గురజాడ' అనే విమర్శనా గ్రంథాన్ని బట్టి, ఆయన చేసిన రేడియో ప్రసంగాలను బట్టి, ఆయన వెలువరించిన వ్యాసాలను, ఖండికలను బట్టి శ్రీశ్రీ విమర్శకుడుగాను పరిగణింపబడుచున్నాడు.

1935 - 59 సం॥ల మధ్య కాలంలో ఆయా పత్రికల్లో తాను రచించిన వ్యాసాలను, ఆయా గ్రంథాలకు వెలువరించిన పీఠికలను, రేడియో ప్రసంగాలను కలిపి శ్రీశ్రీగారు 1959 సం॥లో 'గురజాడ' అనే విమర్శనా గ్రంథాన్ని ప్రచురించాడు. గురజాడ అప్పారావుమీద వచ్చిన విమర్శ గ్రంథాల్లో ప్రముఖమైంది దీనిలో వ్యాసం. 'ముత్యాలసరం' ఛందస్సుమీద సమగ్రమైన పరిశీలనతో కూడి ఉంది. రెండవ వ్యాసంలో గురజాడ వచన రచన విధానాన్ని తెల్పుతుంది. గురజాడను ఆధునికగద్య వాఙ్మయ ప్రవక్తకుడిగా నిలబెడుతుంది.

శ్రీశ్రీ గురజాడ జీవితాన్ని, సాహిత్య దృక్పదాన్ని బాగా పరిశీలించాడు. గురజాడ ఔన్నత్యానికి కారణభూతమైన ప్రగతిశీల సామాజిక దృక్పదం, వ్యావహారిక భాషా ప్రతిపాదనం, సార్వజనీనకత, ముత్యాల సరాల ఛందోవిశిష్టత, నాటకీయ కథనం, అభ్యుదయ దృష్టి, వాస్తవికత వీటితో పాటు కన్యాశుల్కం నాటకంలోని ప్రతిఫలించిన సమకాలీన సమాజం మొదలైన అంశాలమీద శ్రీశ్రీ నిశ్చితాభిప్రాయాలను వెలువరించాడు.

కవిత్రయం మొదలుకొని ఆధునికయుగం వరకు వచ్చిన సాహిత్యాన్ని బాగా పరిశీలించిన శ్రీశ్రీ ఆదికాలంలో తిక్కనను, మధ్య కాలంలో వేమనను, ఆధునిక కాలంలో గురజాడను మహాకవులుగా ప్రతిపాదించాడు. వ్యావహారిక భాషకు, సంఘసంస్కరణకు, వాస్తవికతకు సమగ్రమైన ప్రతిబింబం అని శ్రీశ్రీ తన గ్రంథంలో సోదాహరణంగా నిరూపించాడు.

కన్యాశుల్కాన్ని శ్రీశ్రీ బీభత్సరస ప్రధానమైనదిగాను, విషాదాంత నాటకంగా వర్ణించాడు. కన్యాశుల్కంలోని గిరీశం, రామప్ప పంతులు, లుబ్ధావధానులు కేవలం నవ్వు పుట్టించే పాత్రలే కాదని. వారు శిథిలీకృతమవుతున్న ఒకానొక సాంఘిక వ్యవస్థకు ప్రతీకలని శ్రీశ్రీ చెప్పాడు.


గురజాడ గేయాల్లోని 'దేశభక్తి' రచన ప్రపంచసాహిత్యంలో చేర్చదగిందని, కథలలో 'మీపేరేమిటి' అత్యుత్తమమైందని శ్రీశ్రీ భావించాడు. 'గురజాడ' గ్రంథంలో శ్రీశ్రీ ప్రతిపాదించిన సాహిత్యాంశాలు ఆయన విమర్శనాది, హృదయాన్ని తెలుపుచున్నాయి. ప్రారంభం, నిర్వహణ ఉపసంహారం - ఇవే కళావస్తు నాణ్యత తెలియజేస్తున్నాయి.

సంవిధానం, వ్యాకరణ ఛందస్సులే కాక తదితరమైన ఒక విపుల వ్యవస్థ. కవి తనలో అంతర్గతమైన రసాన్ని పాఠకునిలో బహిర్గతం చేయగల కార్యమే సంవిధానము. దీనికి అఘాతం కలిగితే రసానికి విప్రతిపత్తి సంఘటిల్లినట్లు. కావున తుట్టతుదకు రీతి అనే నదులు రస సముద్రంలోనికే చేరుకుంటాయి. సామాజిక చారిత్రక పరిణామ గమనంలో కవి యొక్క సాహిత్య స్థానం నిర్ణీతమౌతుంది. కవి ప్రగతిశీలి ప్రతిభాశాలి అయితే ఈ గమ్యాన్ని అతడు మరింత విజయవంతం చేస్తాడు.



*Examples of traditional art at the Birla Academy*

MISIMI/మిసిమి RNI Regd. No. 45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd. No. H/SD/191.



**IN HER TREE HOUSE : Earth First environmental activist Julia "Butterfly" Hill, 24, sits on a 200-foot tall ancient Californian Redwood tree near Stafford, in northern California. She has been living on this tree since December 10, 1997. Environmentalists and residents of Humboldt County have been protesting against the increased pace of harvesting of old growth trees in the last remaining grove of Redwood trees in private hands. *(AFP)***